ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

: కలెక్టర్ టీఎస్ చేతన్



పుట్టపర్తి, అక్టోబరు 14: భారీవర్షాల హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సాయిఆరామంలో ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పంచాయతీ, మున్సిపల్, వైద్య శాఖ సిబ్బందికి సెల వులేవన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

సందిరెడ్డికి జాక్‌పాట్



మద్యం దుకాణాలకు లైసెన్సు జారీ లాటరీలో బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు జాక్‌పాట్ తగిలింది. ధర్మవరం నియోజకవర్గంలో ఏకంగా ఐదు మద్యం దుకాణాలు ఆయనకు దక్కాయి. ధర్మవరం మున్సిపాలిటీ, రూరల్‌లో మూడు, బత్తలపల్లి, ముదిగుబ్బలో ఒక్కోటి వశమయ్యాయి. ఈయన ధర్మవరం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు సన్నిహితుడు. మడకశిర నగర పంచాయతీ, గ్రామీణ పరిధిలో టీడీపీ నాయకుడు పీఎస్ వెంకటసుబ్బారెడ్డికి మూడు, ఆయన భార్య వైజయంతిమాల పేరుతో మరో దుకాణం దక్కాయి. మరికొందరు రెండు చొప్పున దుకాణాలను కైవసం చేసుకున్నారు. ధర్మవరంలో టీడీపీ నేత శ్రీశైలం పురుషోత్తం గౌడ్, ముదిగుబ్బలో అదే పార్టీకి చెందిన అన్నమనేని శ్రీనివాసులు, రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లిలో బిత్తిని హరినాథ్, పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్లలో మద్యం వ్యాపారి ఓరుగంటి రవీంద్రనాథ్‌గౌడ్, కదిరిలో టీడీపీ నాయకుడు కందుకూరు గణేష్‌కు రెండు చొప్పున, మడకశిర నియోజక వర్గం అమరాపురంలో తల్లికుమారుడు పీఎం పంకజ, పీఎం సుజిత్‌కు రెండు దుకాణాలు దక్కాయి.

-వివరాలు 6లో....

అయ్యో.. పాపం..!

ముందురోజే భార్యకు సీమంతం..
మరునాడే భర్త మృతి..
శోకసంద్రంలో కుటుంబం

శనివారం దసరా..
ఆదివారం సీమంతం..
బంధువులతో ఇళ్లంతా సందడి..
ఆనందంగా గడిపారు..
సోమవారం బంధువులు బయల్దేరారు..
అందరినీ సాగనంపారు..
ఆ ఇంటికి వెలుగైన యువకుడు
బతుకు పోరాటానికి బయల్దేరాడు..
నిండు గర్భిణి అయిన భార్యకు చెప్పి..
కొన్ని నిముషాల్లోనే ఆ ఇంట విషాదం..
రోడ్డు ప్రమాదం యువకుడిని బలిగొని..
ఆ ఇంట కన్నీళ్లు నింపింది..



భార్యతో భాస్కర్ (ఫైల్)

కదిరి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నం గ్రామ సమీపాన 42వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం ఆగివున్న లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు భాస్కర్ (24) దుర్మరణం చెందాడు. పట్నం గ్రామానికి చెందిన శ్రీనివాసులు, గంగులమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు భాస్కర్. అనంతపురంలో పాల వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. అతడి భార్య లక్ష్మి 9నెలల గర్భిణి. ఆదివారం పట్నంలో లక్ష్మి సీమంతం నిర్వహించారు. సోమవారం బంధువులు అందరూ వెళ్లిపోయారు. రాత్రి ద్విచక్రవాహనంలో భాస్కర్ అనంతపురానికి బయల్దేరాడు. పట్నం దాటాక ఆగివున్న లారీని వేగంగా ఢీకొట్టాడు. దీంతో భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి, శవాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. భాస్కర్ మృతితో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

మానవ మృగాలు..!

- ఐదేళ్లలో 80 మందిపై అత్యాచారం
- భర్త, బంధువుల ముందే పైశాచికం
- ఫొటోలు, వీడియోలు తీస్తూ అఘాయిత్యాలు
- బయటకు చెబితే వీడియోలు షేర్ చేస్తామనీ, చంపేస్తామంటూ బెదిరింపులు
- చోరీకెళ్లిన చోట్ల మహిళలపై దారుణాలు
- గ్యాంగ్ రేప్ నిందితుల విచారణలో విస్తుగొలిపే విషయాలు



హిందూపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన అత్తాకోడలిపై గ్యాంగ్‌రేప్ నిందితులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విచారణలో భయంకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు తెలుస్తోంది. చిలమత్తూరు మండలంలో గత శుక్రవారం అర్ధరాత్రి దాటాక దుండగులు.. సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఈ ఘటనతోపాటు వారి నేర చరిత్ర, ఇలాంటి అఘాయిత్యాలకు ఎక్కడెక్కడ పాల్పడ్డారోనని లోతుగా విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసులే నివ్వెరపోయే విషయాలను నిందితులు చెప్పినట్లు తెలిసింది. బయటకు చెబితే ప్రాణాలు తీస్తామని బెదిరించి భర్తలు, మరికొంతమంది బంధువుల ఎదుటే మహిళలపై పైశాచిక అకృత్యాలకు పాల్పడినట్లు సమాచారం. పరువుపోతుందన్న ఉద్దేశంతో బాధితులు నోరు విప్పలేదు. అదే పంథాలో అత్తాకోడలిపై దారుణానికి ఒడిగట్టినట్లు సమాచారం.

కనుమ అడ్డాగా అత్యాచారాలు?

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందన్నది బహిరంగ రహస్యమే. దీంతో దారుణాలు, దాడులు జరిగినా బాధితులు బయటకు చెప్పుకోలేకపోయారు. పోలీసుల వద్దకెళ్లినా తమకు న్యాయం జరగదని భావించి, మిన్నకుండిపోయారు. గ్యాంగ్ రేప్ నిందితులు చెప్పిన మాటలను బట్టి ఆ విషయం తెలుస్తోందని సమాచారం. గత ఐదేళ్లలో చిలమత్తూరు మండలం లక్ష్మీనరసింహ స్వామి కనుమ సమీపంలో ఈ నిందితులు.. పలువురిపై అత్యాచారాలకు ఒడిగట్టారు. ఇటీవల కనుమ సమీపంలోని కొండలు, గుట్టలవద్ద చెట్ల పొదలు ఉండటంతో ప్రేమజంటలు, కొంతమంది మహిళలు ఒంటరిగా రోడ్డుపక్కకు వెళ్తే చాలు నిఘా ఉంచిన ఈ దుండగులు అఘాయిత్యాలకు పాల్పడి ఆ తరువాత వారిని బెదిరించి పంపించేసినట్లు తెలుస్తోంది. ఐదేళ్లలో 80 మందిదాకా మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారం. కొండలు, చెట్లపొదలు ఎక్కువగా ఉండటంతో కర్ణాటక, హిందూపురం, గోరంట్ల, పెనుకొండ, ప్రాంతాలతోపాటు జిల్లాలోని పలుప్రాంతాల నుంచి ప్రేమ జంటలు శని, ఆదివారాలతోపాటు మిగిలిన రోజులుకూడా ఏకాంతం కోసం కనుమ సమీపంలోకి వస్తుంటాయి. దీనిని పసిగట్టిన మానవమృగాలు ప్రియుడిని బంధించి ప్రియురాలిపై అత్యాచారం చేయడం, భార్యాభర్తలు వెళ్తుంటే వాహనం ఆపి, సాయం అడుగుతూ ఆ సమయంలో రహదారి వెంట ఎవరూ రాకపోతే వారిని చెట్లపొదల్లోకి లాక్కెళ్లి దాడిచేసి మహిళలపై అత్యాచారం చేసేవారని తెలిసింది. కొన్ని సందర్భాల్లో ప్రియుడు, భర్త ముందే వీటికి పాల్పడినట్లు సమాచారం.

వీడియోలు తీస్తూ పైశాచికం

మహిళలను లాక్కెళ్లి అఘాయిత్యాలకు పాల్పడిన సందర్భంలో మరొకరు వీడియోలు తీస్తూ పైశాచిక ఆనందం పొందేవారని తెలిసింది. మహిళలతో కలిసి ఉన్న వీడియోలు, ఫొటోలు తీసుకుని ఈ ఘటన ఎవరికైనా చెబితే వీడియోలు బయటపెడతామనీ, ఇళ్లకే వచ్చి అంతుచూస్తామని బెదిరించినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్నట్లు సమాచారం. కొన్ని సందర్భాల్లో తీసిన వీడియోల ఆధారంగా వారి వద్ద సెల్‌నంబరు తీసుకుని బ్లాక్‌మెయిల్ చేశారు. ఈ విషయాలు బయటకు చెబితే ప్రాణాలు ఉండవని బెదిరించారు. చిలమత్తూరు కనుమతోపాటు లేపాక్షి మండలంలోని అటవీప్రాంతంలో ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడ్డారు.

విస్తుగొలిపే విషయాలు

సామూహిక అత్యాచార నిందితులు పోలీసుల విచారణలో విస్తుగొలిపే విషయాలు చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. కొన్నిసార్లు సామూహిక అత్యాచారాలకు పాల్పడిన నిందితుల్లో ముగ్గురు చోరీలకు వెళ్లేవారు. చోరీ చేయడంతోపాటు కొన్నిచోట్ల మహిళలపై కూడా అఘాయిత్యాలకు పాల్పడేవారు. దొరికింది దోచుకుని మహిళలపై కూడా దాడులు చేయడం వీరికి పరిపాటి. గంజాయి మత్తులో ఉన్నపుడు వయసుతో సంబంధం లేకుండా మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. గత వారం లేపాక్షి మండలంలోని అటవీప్రాంతానికి వెళ్లిన ఓ జంటపై ముగ్గురు వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. నిందితులు తెలిపిన విషయాలు విన్న పోలీసులు ముక్కున వేలేసుకున్నారు. ఇన్నేళ్లుగా ఇన్ని దారుణాలు జరుగుతుంటే ఏ ఒక్కరూ బయటకు రాకపోవడం గమనార్హం.

పరువుపోతుందని..

కొంతకాలంగా పలువురిపై దుండగులు అఘాయిత్యాలకు పాల్పడుతున్నా.. ఇప్పటి వరకు బాధితులు బయటకు రాకపోవడానికి కారణం పరువు పోతుందన్న ఉద్దేశమేనని పోలీసులు భావిస్తున్నారు. ఒకరిద్దరు పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావించినా.. అప్పటి పరిస్థితుల్లో ముందుకు రాలేకపోయినట్లు సమాచారం. ఏది ఏమైనా అత్తాకోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులు.. పోలీసులకు చెబుతున్న విషయాలు బయట ప్రపంచానికి తెలిస్తే ఏమవుతుందోనన్న భయం కూడా వారిలో ఉండవచ్చు. ఎందుకంటే ఈ గ్యాంగ్‌లో మోస్ట్‌వాంటెండ్ క్రిమినల్స్ ఉండటంతోపాటు దేనికైనా తెగబడతారు కాబట్టి భయపడి ఉండవచ్చు. ఇలాంటి మానవమృగాలకు ఏ శిక్ష వేసినా తక్కువేనంటూ పోలీసులే చర్చించుకోవడం గమనార్హం.

ఒకరు కాదు.. ఇద్దరు కాదు..
ఏకంగా 80 మందిపై అత్యాచారం..
అది కూడా భర్త, బంధువుల ముందే..
ఫొటోలు, వీడియోలు తీస్తూ పైశాచికత్వం..
బయటకు చెబితే వీడియోలు రిలీజ్
చేస్తామనీ, చంపేస్తామని బెదిరింపులు..
చోరీకి వెళ్లిన చోట మహిళలపై
అఘాయిత్యాలు..వామ్మో..
వీళ్లు మానవ మృగాలు కాదు..
అంతకన్నా దారుణాతి దారుణమైన వాళ్లు..
అత్తాకోడలిపై గ్యాంగ్ రేప్ సంచలనమైంది..
ఇందుకు పాల్పడిన దుండగుల
నేరచరిత్ర భయానకంగా ఉంది..
విచారణలో వారుచెప్పే విషయాలు విని..
పోలీసులే విస్తుపోయారట..



అఘాయిత్యాలకు పాల్పడింది ఈ ప్రాంతంలోనే..

పకడ్బందీగా ఈ-ఆఫీస్

పురపాలికల్లో నిర్వహణకు చర్యలు
అన్ని ఫైళ్లు చేయాలని ఆదేశాలు
వచ్చేనెల 30 వరకు గడువు



ధర్మవరం మున్సిపల్ కార్యాలయం

ధర్మవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఈ-ఆఫీస్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. మున్సిపాలిటీల్లో ప్రతీ ఫైల్ ఈ-ఆఫీస్ ద్వారానే పంపాలని ఆదేశాలు జారీచేసింది. తద్వారా ఫైళ్లు ఉండవని భావిస్తోంది. వచ్చేనెల 15లోగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించింది. 30వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయాల్సి ఉంటుందని మున్సిపల్ శాఖ డైరెక్టర్ (డీఎంఏ) నుంచి పురపాలికలకు ఆదేశాలు అందాయి. దీంతో ఈ-ఆఫీస్‌ను పటిష్ఠంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత టీడీపీ హయాంలో ఈ-ఆఫీస్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరాక ఈ విధానాన్ని ఈ-ఆఫీస్‌కు పెద్దగా ప్రాధాన్యమివ్వలేదు. మొక్కుబడిగా నిర్వహించారు. దీంతో పనుల్లో పారదర్శకత లేకుండాపోయింది. జవాబుదారీతనం కూడా కరువైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మళ్లీ ఈ-ఆఫీస్‌ను పటిష్ఠంగా అమలు చేసే దిశగా అడుగులు వేస్తోంది. అన్ని ఫైళ్లు ఈ-ఆఫీస్ విధానంలో పంపాలంటూ డీఎంఏ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అత్యవసర ఫైళ్లను మాత్రమే మాన్యువల్‌గా నిర్వహించుకునే వెసులుబాటు కల్పించింది. మిగతా ఫైళ్లన్నీ ఈ-ఆఫీస్‌లోనే ఉండాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో మళ్లీ ఈ-ఆఫీస్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో కమిషనర్లు ఇప్పటికే అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇకపై ఫైళ్లను ఈ విధానంలోనే అన్ని శాఖల్లో నిర్వహించనున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో బదిలీలు జరిగి కొత్త ఉద్యోగులు బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఈ విధానంపై కసరత్తు చేస్తున్నారు. గతంలో ఎలా నిర్వహించారన్న దానిపై ఆరాతీస్తున్నారు. ఫైళ్లలో జాప్యాన్ని అరికట్టేందుకు కొత్త విధానం దోహదపడుతుందని అంటున్నారు. మున్సిపాలిటీల అనంతరం మిగతా శాఖలకు కూడా ఈ-ఆఫీస్‌ను పరిచయం చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

పారదర్శక విధానం

ఈ-ఫైల్ విధానం పారదర్శకంగా ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఫైల్ ఎక్కడ ఆగిపోయిందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఉద్యోగుల్లోజవాబుదారీతనం పెరుగుతుంది. ఫైళ్ల పరిస్థితిని ఉన్నతాధికారులు కూడా చూసుకునే అవకాశం ఉందని అంటున్నారు. పరిపాలన సమర్థవంతంగా సాగుతుందనీ, పెండింగ్ అనేది ఉండదని అంటున్నారు. అందువల్లే కూటమి ప్రభుత్వం ఈ-ఆఫీస్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తుందని అంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మున్సిపాలిటీల్లో ఉద్యోగులు కూడా ఈ-ఆఫీస్‌పై త్వరితగతిన అవగాహన పెంచుకునే పనిలో పడ్డారు.

ఐదు విభాగాల్లో కీలకం

మున్సిపాలిటీల్లో పరిపాలన, టౌన్‌ప్లానింగ్, పారిశుధ్యం, ఇంజనీరింగ్, అకౌంట్స్, రెవెన్యూ విభాగాలకు సంబంధించి ఫైల్స్ ఎక్కువగా ఉంటాయి. వీటికి సంబంధించి ఫైల్స్ ఈ-ఆఫీస్ ద్వారానే అమలు చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం గతంలోనే అమలుకు చర్యలు తీసుకుంది. దీంతో ఈ విధానం అమలవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం కూడా ఈ విధానాన్ని కొనసాగించినా.. పూర్తిగా అమలు చేయలేదన్న ఆరోపణలున్నాయి.

ముంచిన ముసురు

- వేరుశనగ పంటకు దెబ్బ
- నానుతున్న దిగుబడి
- లబోదిబోమంటున్న రైతులు



పెద్దపల్లి వద్ద వర్షానికి తడుస్తున్న తొలగించిన వేరుశనగ

తనకల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో చిరుజల్లులు రాలుతూ ముసురేసింది. దీంతో పొలాల్లో తొలగించిన వేరుశనగ పంట తీవ్రంగా దెబ్బతింటోంది. పలువురు రైతులు పంటను తొలగించారు. కొందరు పొలాల్లోనే కుప్పలుగా కూడా వేసుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న చిరుజల్లులు, ముసురు కారణంగా చేతికొచ్చిన పంట దెబ్బతింటోంది. వేరుశనగ కట్టె, కాయలు నల్లగా మారిపోతున్నాయి. దీంతో మార్కెట్‌లో కొనేవారుండరని రైతులు వాపోతున్నారు. ఇదే వాతావరణ పరిస్థితులు కొన్నిరోజులపాటు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్న నేపథ్యంలో అన్నదాతలు భయాందోళనలు చెందుతున్నారు. అదే జరిగితే తాము పంట పూర్తిగా నష్టపోతామని వాపోతున్నారు.



తొలగించిన వేరుశనగను కుప్పగా వేసి కవర్లు కప్పిన రైతులు

అన్నదాతల్లో ఆందోళన

వర్షాధారంగా ఏటా వేరుశనగ పంట సాగుచేయడం, నష్టపోవడం రైతుల వంతవుతోంది. ఈసారి కూడా అప్పులు చేసి మండల రైతులు మూడువేల ఎకరాల్లో పంట పెట్టారు. ప్రారంభం నుంచి ఊరిస్తూ వచ్చిన వేరుశనగ పంట తీరా ఊడ దిగి బుడ్డ ఏర్పడే దశలో వరుణుడు ముఖం చాటేశాడు. పంట కొంతమేర దెబ్బతింది. ఎంతోకొంత పంట చేతికొస్తుందన్న ఆశతో రైతులు పంట తొలగించారు. ఈ సమయంలో వర్షం రూపంలో మరో విపత్తు వచ్చిపడింది. వర్షం బారి నుంచి పంటను కాపాడుకోవడానికి రైతులు పడుతున్న బాధలు అన్నీఇన్నీకావు. పొలాల్లోనే ఉన్న వేరుశనగ వాములు (కట్టెను) అలాగే వదిలేశారు. వాతావరణ శాఖ నాలుగురోజులపాటు భారీవర్షాలు కురుస్తాయని చెబుతుండడంతో వేరుశనగ సాగుచేసిన రైతుల్లో ఆందోళన నెలకొంది. నాలుగు రోజులు ఇలాగే వర్షాలు పడితే గ్రాసం కూడా కుళ్లిపోతుందని కొంతమంది, అరకొరగా ఉన్న కాయలు మొలకొస్తాయని మరికొంతమంది, వర్షానికి తడిసిన కాయలు నల్లగామారి గిట్టుబాటు ధరలు రావని మరికొంతమంది రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

వేరుశనగ సాగుచేసి నష్టపోయా



సొంత భూమి లేకపోవడంతో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని, వేరుశనగ సాగుచేశా. కాయలు ఏర్పడే సమయంలో వర్షంలేక దిగుబడి తగ్గిపోయింది. కనీసం గ్రాసమైనా దక్కుతుందని ప్రస్తుతం పంటను తొలగించా. చేనులోనే ఉంది. నాలుగురోజులు ముసురు పట్టుకుంటుందని అధికారులు చెబుతుండడంతో భయంగా ఉంది.

- శాంతమ్మ, కౌలు రైతు, పెద్దపల్లి

పగవాడికి కూడా వద్దు.. ఈ కష్టాలు



మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశా. ఎకరంలో పంట తొలగించడానికి రూ.6వేలు కూలీలకు ఇచ్చా. రెండ్రోజులు వేరుశనగ చెట్లు ఎండాయి. ఇంటికి తరలిద్దామనుకున్న తరుణంలో వర్షం కురుస్తుండడంతో ఎలా కాపాడుకోవాలో అర్థం కావడంలేదు. కుప్పలుగా పెట్టి, కవర్లు కప్పి వర్షంలో తాము పడుతున్న బాధలు పగవాడికి కూడా వద్దు.

- రామచంద్రారెడ్డి, రైతు, వడ్డుమరవపల్లి

అన్న క్యాంటిన్ ప్రారంభం

సర్వత్రా హర్షం



అన్న క్యాంటిన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

కదిరి/కదిరి అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆకలి తీర్చే ఉద్దేశంతో పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా పక్కన అన్న క్యాంటిన్‌ను పునఃప్రారంభించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఎంపీ బీకే పార్థసారథి సోమవారం రిబ్బన్ కట్ చేసి, క్యాంటిన్‌ను ప్రారంభించారు. అనంతరం వారు అన్నం వడ్డించారు. ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ.. నిరుపేదల ఆకలి తీర్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి, మహిళా నేత పర్వీన్‌భాను, నాయకుడు బంగారు క్రిష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, జనసేన నాయకుడు భైరవప్రసాద్, పట్టణాధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, తెలుగుయువత నేత కొమ్మినేని గంగయ్య, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదాత అన్న క్యాంటిన్

కూటమి అధికారంలోకి రావడంతో చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నిప్రాంతాల్లో అన్న క్యాంటిన్లను పునఃప్రారంభిస్తున్నారు. కదిరిలో సోమవారం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. దీంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతలా క్యాంటిన్



నిరుపేదలు, అనాథలకు అన్నదాతలా అన్నక్యాంటిన్లు ఆకలి తీరుస్తున్నాయి. ఇకపై నాలాంటి పేదలకు కడుపు నిండా అన్నం దొరుకుతుంది. అన్నక్యాంటిన్ పునఃప్రారంభించడం సంతోషకరం.

- గంగోజమ్మ



అన్న క్యాంటిన్ భవనం

నాలాంటి వారికి ఎంతో మేలు



భోజనంకొనేందుకు అసవరమైన డబ్బు నాదగ్గర ఉండదు. ఎవరైనా దయతలచి ఏదైనా ఇస్తే, అదే తిని ఆకలి తీర్చుకుంటా. ఒక్కోసారి ఏమీ దొరక్క పస్తులతో పడుకుంటా. ఇప్పుడు రూ.5కే అన్న క్యాంటిన్‌లో భోజనం పెడుతుండడం సంతోషదాయకం. నాలాంటివారెందరికో ఆకలి బాధ తప్పింది.

- రెడ్డెప్ప

రూ.5కే భోజనం సంతోషదాయకం



అన్నక్యాంటిన్ ప్రారంభించడం సంతోషదాయకం. ఐదేళ్లుగా వీటిని మూసేయడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఆటో నడుపుకునీ జీవనం సాగిస్తున్నా. గతంలో ఇంటికెళ్లకుండా ఇక్కడే రూ.5కే భోజనం తినేవాడిని. వైసీపీ ప్రభుత్వంలో మూసివేయడంతో ఇంటికెళ్లే సమయం లేక ఒక్కోసారి మధ్యాహ్న భోజనం తినేవాడిని కాదు. ప్రస్తుతం అన్నక్యాంటిన్‌ను ప్రారంభించడంతో ఆకలి బాధతు తప్పనున్నాయి.

- సుధాకర్, ఆటోడ్రైవర్

న్యూస్ బాక్స్

సత్యసాయి సేవాసమితి ప్రారంభం



నగర సంకీర్తనలో సాయిభక్తులు

ధర్మవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఆర్‌టీ సర్కిల్ సమీపంలోని సుబ్బదాసు సత్రంలో భగవాన్ సత్యసాయి బాబా సేవా సమితిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబాసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ 45 సంవత్సరాలుగా సత్యసాయిబాబా భజనలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి నెలా 24 అన్నదానం, 19న మహిళా డే, ప్రతి రోజూ నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

ఇది జేఎన్‌టీయూ టైమ్స్

● వర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు



అనంతపురం సెంట్రల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనంతపురానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. టైమ్స్ హైయ్యర్ ఎడ్యుకేషన్(టి) నిర్వహించిన ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్-2025లో జేఎన్‌టీయూకి 801-1000 ర్యాంక్ బ్యాండ్ దక్కింది. ఇండియాలోని వర్సిటీల్లో 23వ ర్యాంకు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా వీసీ సుదర్శన రావు హర్షాన్ని వ్యక్తం చేస్తూ ర్యాంకింగ్ వివరాలను వెల్లడించారు. బోధన, పరిశోధన, పరిశ్రమల అనుసంధానం, అంతర్జాతీయ దృక్పథం తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్న ది సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత విద్యనందించే సంస్థలకు ర్యాంకులను ప్రకటించిందన్నారు. ఈ ర్యాంకుల్లో జేఎన్‌టీయూకి మెరుగైన చోటు దక్కడం హర్షణీమని తెలిపారు. వర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ప్రణాళికాబద్ధమైన కృషి ర్యాంకింగ్ రావడానికి దోహదపడిందన్నారు.

క్రీడా సర్టిఫికెట్ల పరిశీలన

● 150మందికిగాను 60మంది హాజరు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసు పోస్టులకు స్పోర్ట్స్ కోటాలో అభ్యర్థుల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించారు. 2019లో విడుదలైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ నోటిఫికేషన్‌లో మిగిలిన మహిళా పోలీస్ పోస్టులకు స్పోర్ట్స్ కోటా అభ్యర్థులను కోర్టు ఆదేశాలతో సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. ఈ కార్యక్రమం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. మహిళా పోలీసు పోస్టులు 24గాను 150మందికి కాల్‌లెటర్‌లు పంపగా 60మంది మాత్రమే హాజరయ్యారు. ఎస్పీ ఆఫీస్ సూపరింటెండెంట్ నందకుమార్, ఇన్‌చార్జి డీఎస్‌డీఓ అనిల్‌కుమార్ నేతృత్వంలో అభ్యర్థుల నేషనల్, ఇంటర్నేషనల్, యూనివర్సిటీ, ఎస్‌జీఎఫ్, అసోసియేషన్‌ల, ఫెడరేషన్‌ల వారీగా క్రీడా సర్టిఫికెట్లను పరిశీలించారు. అభ్యర్థుల నుంచి ఆయా క్రీడా సర్టిఫికెట్లు ఒక సెట్ తీసుకున్నారు. అనంతరం సర్టిఫికెట్లను ఆయా సంస్థలు, సంఘాల ద్వారా మరోసారి తనిఖీ చేసి తుది నిర్ణయం తీసుకుంటారు. కార్యక్రమంలో కోచ్‌లు, ఎస్పీ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవితలకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాయలసీమ 8వ మహాకవిసమ్మేళనానికి కవుల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. విభిన్న రంగాల సీమ ప్రముఖులపై కవితలను రాసి, డిసెంబరు 8లోపు 9963917187 నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు.

కొనసాగిన పప్పుశనగ రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పప్పుశనగ విత్తనాల కోసం జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో రైతుల పేర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం కొనసాగింది. ఇప్పటి దాకా 13,397 మంది రైతులు 18,808 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

టమోటా కిలో రూ.53

అనంతపురంరూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.53తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.30పలికినట్లు ఆయన తెలిపారు.

1.634 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.634 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 1148 క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1108 క్యూసెక్కులు వెళుతున్నట్లు వారు పేర్కొన్నారు.

లక్కీ లాటరీ..!



హాజరైన దరఖాస్తుదారులు

● మద్యం దుకాణాల లాటరీలో పలువురికి జాక్‌పాట్
● బీజేపీ అనంత జిల్లా అధ్యక్షుడికి ఐదు షాపులు
● మడకశిరలో ఒకే కుటుంబానికి నాలుగు
● అధికార సిండికేట్ కూటమి హవా
● మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తి కిడ్నాప్ హైడ్రామా
● లాటరీ కేంద్రం వద్ద భార్య, బంధువుల ధర్నా
● హిందూపురం వన్‌టౌన్ సీఐ ఎదుట రంగనాథ్ ప్రత్యక్షం
● రేపట్నుంచి ప్రైవేటు మద్యం దుకాణాల్లో విక్రయాలు



మద్యం దుకాణాల లాటరీని పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

పుట్టపర్తి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మద్యం దుకాణాల లైసెన్సుల జారీ లాటరీ అధికార కూటమికి లక్కీ లాటరీగా మారింది. జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో సోమవారం మద్యం దుకాణాలకు లక్కీడ్రా కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 87 మద్యం దుకాణాలకు 1518 దరఖాస్తులు రాగా.. రెండు టేబుళ్లపై లక్కీడ్రా తీశారు. సిండికేట్‌తో మద్యం దుకాణాల్లో 90శాతానికిపైగా అధికార కూటమి నేతలు, అనుచరగణానికే దక్కాయి. కదిరి, ధర్మవరం, హిందూపురం, చెన్నేకొత్తపల్లి, మడకశిర, పెనుకొండ, తనకల్లు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఐదారు మినహా అన్నీ అధికార కూటమి వశమయ్యాయి. పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అధికార కూటమి నేతలతో పాటు ఔత్సాహికులు, ప్రతిపక్ష పార్టీ నేతలు సైతం భారీగా దరఖాస్తులు చేశారు. లాటరీలో మిశ్రమంగా దక్కాయి. మద్యం దుకాణాల లాటరీకి సోమవారం ఉదయం నుంచి దరఖాస్తుదారులు సాయిఆరామం వద్దకు క్యూకట్టారు. సిండికేట్‌గా దరఖాస్తులు చేసిన వారిలో టెన్షన్ కన్పించలేదు. మిగతావారిలో మాత్రం ఉత్కంఠ నెలకొంది. మహిళలు సైతం మద్యం దుకాణాలకు పోటీ పడ్డారు. యువతతోపాటు చంటిబిడ్డలతో లాటరీకి హాజరయ్యారు. మడకశిర, పుట్టపర్తి, కదిరి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. కొందరికి దుకాణాలు దక్కకపోవడంతో నిట్టూరుస్తూ వెనుదిరిగారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందునాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు పాల్గొన్నారు.

లిక్కర్ కిక్కు వారిదే

మద్యం దుకాణాల లక్కీడ్రాలో కొందరిని అదృష్టం వరించింది. ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 20 దుకాణాల్లో మూడు మినహా అన్నీ కూటమి నేతల అనుచర గణానికే దక్కాయి. మంత్రి సత్యకుమార్ యాదవ్ సన్నిహితుడు, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు ఐదు దుకాణాలు దక్కాయి. ధర్మవరం మున్సిపాలిటీ, రూరల్‌లో మూడు, బత్తలపల్లి, ముదిగుబ్బలో ఒక్కోటి వశమయ్యాయి. ధర్మవరంలో టీడీపీ నేత శ్రీశైలం పురుషోత్తం గౌడ్, ముదిగుబ్బలో అదే పార్టీకి చెందిన అన్నమనేని శ్రీనివాసులు, రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లిలో బిత్తిని హరినాథ్, పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్లలో మద్యం వ్యాపారి ఓరుగంటి రవీంద్రనాథ్‌గౌడ్, కదిరిలో టీడీపీ నాయకుడు కందుకూరు గణేష్‌కు రెండు చొప్పున, మడకశిర నగర పంచాయతీ, గ్రామీణ పరిధిలో పీఎస్ వెంకటసుబ్బారెడ్డికి మూడు, ఆయన భార్య వైజయంతిమాల పేరుతో మరో దుకాణం దక్కాయి. మడకశిర నియోజక వర్గం అమరాపురంలో తల్లికుమారుడు పీఎం పంకజ, పీఎం సుజిత్‌కు రెండు దుకాణాలు దక్కాయి. ఐదు దుకాణాలు దక్కించుకున్న సందిరెడ్డి శ్రీనివాసులు, ఆయన బృందం నియోజక వర్గంలో 27 దరఖాస్తులు సమర్పించారు. మడకశిరలో నాలుగు దకాణాలు దక్కిన పీఎస్ వెంకటసుబ్బారెడ్డి, ఆయన బృందం 29 దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. కనగానపల్లిలో రెండు దుకాణాలకు హరినాథ్ 13 దరఖాస్తులు వేశాడు. హిందూపురంలో టీడీపీ, వైసీపీ నేతలు సిండికేట్‌గా మారి, నియోజకవర్గ వ్యవహారాలు చూసే ఇద్దరు పీఏలు ఏకంగా 9 దుకాణాలకు పలు పేర్లపై 40 దరఖాస్తులు చేశారు. పరిగిలో రెండు దుకాణాలకు మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి వర్గీయులు పోటీపడి 86 దరఖాస్తులు చేశారు.

మహిళలకు లక్కీ చాన్స్

మద్యం దుకాణాలకు దరఖాస్తుల్లో మహిళలు పోటీపడ్డారు. ఐదుగురికి మద్యం దుకాణాలు దక్కాయి. హిందూపురం మున్సిపాలిటీలో 50వ దుకాణానికి నాగరత్నమ్మ, మడకశిర నగర పంచాయతీలో 78వ షాపునకు వైజయంతిమాల, అమరాపురంలో 83వ దుకాణానికి పంకజ, పుట్టపర్తి నగర పంచాయతీలో 39కి ప్రశాంతి, గాండ్లపెంటలో టంగుటూరి సురేఖకు దుకాణాలు దక్కాయి. జిల్లా వ్యాప్తంగా పలు దకాణాలకు మహిళలు దరఖాస్తులు చేసి సిండికేట్ ముందు నిలువలేకపోయినట్లు చర్చ సాగుతోంది.



చంటిబిడ్డతో హాజరైన మహిళ

కిడ్నాప్ కలకలం

లక్కీడ్రాలో చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లికి చెందిన రంగనాథ్‌కు లేపాక్షిలో 57 మద్యం దుకాణం దక్కింది. ఉదయం 10 గంటల సమయంలో రంగనాథ్‌ను హిందూపురానికి చెందిన కొందరు చర్చిద్దామని పిలుచుకెళ్లారు. లాటరీ తగిలిన విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో రంగనాథ్‌తో మాట్లాడేందుకు వారు ప్రయత్నించగా.. ఫోన్ స్విచాఫ్ వచ్చింది. రంగనాథ్ భార్య అశ్విని, కుటుంబ సభ్యులు పుట్టపర్తికి వచ్చి ఆరాతీశారు. హిందూపురానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు.. రంగనాథ్‌ను తీసుకెళ్లినట్లు తెలుసుకున్నారు. తన భర్తను కిడ్నాప్ చేశారంటూ అశ్విని, బంధువులు.. పుట్టపర్తి అర్బన్ పోలీసు స్టేషన్ హిందూరానికి చెందిన మంగేష్, ఆనంద్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం సాయిఆరామంలో మద్యం దుకాణానికి లైసెన్సు ఫీజు చెల్లిస్తామని ఎక్సైజ్ అధికారులకు విన్నవించారు. దరఖాస్తుదారుడే చెల్లించాలని చెప్పడంతో ప్రధాన ముఖద్వారం ఎదుట ధర్నాకి దిగారు. రంగనాథ్‌ను పిలుచుకెళ్లిన వారు యగ్నిశెట్టిపల్లిలోని బంధువులకు ఫోన్ చేసి, రూ.10 లక్షల గుడ్‌విల్ ఇస్తామనీ, ప్రతినెలా రూ.15వేలు ఇస్తామనీ, అందుకు ఒప్పుకుంటే రేపు సాయంత్రానికి రంగనాథ్ వస్తాడంటూ ధర్నాకు దిగిన అతడి బంధువులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలంటూ ఒత్తిళ్లు తెచ్చారు. సోమవారం రాత్రిదాకా రంగనాథ్ కిడ్నాప్ హైడ్రామా నడిచింది. ఎట్టకేలకు రంగనాథ్ హిందూపురంలో ప్రత్యక్షమయ్యాడు. వన్‌టౌన్ సీఐ ఎదుట హాజరయ్యాడు. మొబైల్ ఫోన్ మరమ్మతులకు లోనవడంతో భార్య, కుటుంబ సభ్యులతో మాట్లాడలేకపోయాననీ, తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని సీఐ ఎదుట వెల్లడించడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది.



ధర్నా చేస్తున్న రంగనాథ్ భార్య, బంధువులు

కిక్కు.. కొందరికే లక్కు..!

● జేఎన్‌టీయూలో ముగిసిన లాటరీ ప్రక్రియ
● 136 మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి
● 19 దుకాణాలను దక్కించుకున్న మహిళలు

అనంతపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో సోమవారం కేటాయించారు. జిల్లాలోని 136 మద్యం దుకాణాలకు 3265 దరఖాస్తులు వచ్చాయి. కొందరు ఎక్కువ దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో లాటరీ ప్రక్రియకు 2500 మంది దాకా వచ్చారు. దరఖాస్తుదారులతో వర్సిటీ ప్రాంగణంలో సందడి కనిపించింది. లాటరీ వేదికకు ఉదయం 7 గంటలకే చేరుకోవాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. కొందరు దరఖాస్తుదారులు ముందుగానే చేరుకోగా.. మరికొందరు ఆలస్యంగా వచ్చి పరుగులు పెట్టారు. మహిళలు సైతం గణనీయంగా వచ్చారు. యాభై మందికిపైగా మహిళలు లాటరీ ప్రక్రియలో పాల్గొన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ్ శర్మ, ఎస్పీ జగదీష్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభమైంది. ముందుగా అనంతపురం అర్బన్‌లోని మొదటి దుకాణం డ్రా తీశారు. మధ్యాహ్నం 2గంటలకు మొత్తం దుకాణాల లాటరీలు తీశారు. లక్కీ డ్రా ప్రారంభం కాగానే దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ కనిపించింది. అనంతపురం అర్బన్‌లో మొదటి దుకాణానికి 44 దరఖాస్తులు వచ్చాయి. 30వ టోకన్ నంబర్ దరఖాస్తుదారు చల్లా లక్ష్మీనారాయణకు ఆ దుకాణం దక్కింది. రెండో దుకాణం ఎమ్మెల్యే దగ్గుపాటి ముఖ్య అనుచరుడు గంగారామ్‌కు దక్కింది.



ఉరుకులు.. పరుగులు..

అనుచరులకు నిరాశ

అనంతపురం అర్బన్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అనుచరులు 30 దుకాణాలకు ఏకంగా 300లకుపైగా దరఖాస్తులు సమర్పించారు. లక్కీ డ్రాలో 11 దుకాణాలు మాత్రమే దక్కాయి. మిగిలిన 19 దుకాణాలు మద్యం వ్యాపారులు, తటస్థులకు దక్కాయి. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.1.70 కోట్లు సొంత డబ్బుతో పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేయించారు. మొత్తం 10 దుకాణాలు ఉండగా.. రెండు మాత్రమే అమిలినేని అనుచరులకు దక్కాయి. దీంతో ఎమ్మెల్యేతోపాటు పార్టీ శ్రేణులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. ఇక్కడ ఏకంగా 8 దుకాణాలు మద్యం వ్యాపారులు, తటస్థులకు దక్కాయి.



లక్కీ నంబరును చూపుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

టీడీపీ శ్రేణులకే మెజార్టీ దుకాణాలు

తాడిపత్రి నియోజకవర్గంలో 20 దుకాణాలకుగాను 10కిపైగా జేసీ అనుచరులకే దక్కాయి. రెండు విజయవాడ వ్యక్తులకు దక్కగా.. మిగిలినవి వ్యాపారులు, తటస్థులకు దక్కాయి. రాయదుర్గం నియోజకవర్గంలో 14 దుకాణాలు ఉండగా... 2 వైసీపీ, 2 తటస్థులకు దక్కాయి. 10 దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. గుంతకల్లు నియోజకవర్గంలో 23 దుకాణాలు ఉండగా... వైసీపీ, జనసేన, నంది గ్రూప్‌లకు ఒక్కొక్కటి దక్కాయి. మిగిలిన దుకాణాలు స్థానిక ఎమ్మెల్యే అనుచరులు, టీడీపీ నాయకులకు దక్కాయి. రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లో మొత్తం 8 దుకాణాలు ఉండగా... రెండు నంది గ్రూప్‌నకు దక్కాయి. ఒకటి తటస్థులకు, మిగిలిన దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. ఉరవకొండ నియోజకవర్గంలో మొత్తం 13 దుకాణాలు ఉండగా.. 2 దుకాణాలు వైసీపీ నాయకులకు, ఒకటి తటస్థులకు దక్కాయి. 10 దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. శింగనమల నియోజకవర్గంలో 18 దుకాణాలు ఉండగా.. 14 దుకాణాలు టీడీపీ శ్రేణులకు, 3 వైసీపీ శ్రేణులకు, ఒకటి తటస్థుడికి దక్కాయి. జిల్లాలో 136 మద్యం దుకాణాల్లో మెజార్టీ దుకాణాలు టీడీపీ శ్రేణులకు దక్కాయి. వైసీపీ వర్గీయులు ఏడు దుకాణాలను దక్కించుకున్నారు.

మహిళలకు 19 దుకాణాలు

జిల్లాలోని 136 దుకాణాల్లో 19 మహిళలకు దక్కాయి. ఇందులో నాలుగు నంద్యాల జిల్లా నంది గ్రూప్ సంస్థలకు చెందిన సుజల దక్కించుకున్నారు. అనంతపురం రూరల్ మండలంలో రెండు, గుంతకల్లు, కళ్యాణదుర్గం రూరల్‌లో ఒక్కొక్క దుకాణాలను దక్కించుకున్నారు. శింగనమల నియోజకవర్గ పరిధిలోని బుక్కరాయసముద్రంలో వైసీపీకి చెందిన పూజారి నారాయణమ్మ లాటరీలో దుకాణం దక్కించుకున్నారు. మిగిలిన 14 దుకాణాలను టీడీపీకి చెందిన మహిళలు దక్కించుకున్నారు.



లక్కీ డ్రాకు హాజరైన మహిళలు

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌లో సీటు కోసం అర్హులైన గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 22 నుంచి 25 వరకూ రాత పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ నెల 27న అభ్యర్థులకు రాతపరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు కార్యాలయ సిబ్బంది హిమసాగర్ సెల్ : 8309200704కు సంప్రదించాలన్నారు.

పోరాటయోధుడు సదాశివన్

● ఐదుకల్లుకు ఘన నివాళి



మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం విద్య, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఐదుకల్లు సదాశివన్ గొప్ప పోరాటయోధుడని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఆయన 36వ వర్ధంతిని సోమవారం సీపీఐ ఆఫీస్‌లో నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నేతలు ముఖ్య అతిథులుగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాఫర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, హరిజనోద్యమ నాయకుడిగా, ప్రజాసేవకుడిగా, కమ్యూనిస్టుగా సదాశివన్ ఎంతగానో సేవలు అందించారన్నారు. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ఐదుకల్లు సేవలు చిరస్మరణీయం అన్నారు. శాసన మండలి సభ్యుడిగా పనిచేసినా సాదాసీదాగానే జీవించారన్నారు. ఆయన ఆశయాలను యువ కమ్యూనిస్టులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, నగర సహాయ కార్యదర్శి రమణ, అల్లిపీరా, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సంతోష్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సాగునీటి సాధన కోసం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈనెల 20 వరకు చేపట్టనున్న బస్సు యాత్రను జయప్రదం చేయా లని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యలయంలో సోమవారం బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ పాలకుల విధానాల వల్ల జిల్లా శతాబ్దాలుగా వెనుకబడి ఉందన్నారు. సాగునీటి వనరుల అభివృద్ధికి సరైన చర్యలు చేపట్టకుండా జిల్లాకు అన్ని ప్రభుత్వాలు అన్యాయం చేశాయని విమర్శించారు. ఎగువ తుంగభద్ర, దిగువ శ్రీశైలం డ్యాములు నిండి పొంగి పొర్లుతున్నా మన జిల్లాకు రావాల్సిన నీరు రాకపోవడం దారుణమన్నారు. ఈ పరిస్థితిపై ప్రజాభిప్రాయాన్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు బస్సుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయం బతకాలంటే కనీసం 30శాతం భూమికి సాగునీటి వనరులు కల్పించాలని జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లో సూచించిందన్నారు. జిల్లాలో నికరంగా 14.85లక్షల ఎకరాల సాగుభూమి ఉందని, ఇందులో స్థిరీకరించబడిన ఆయకట్టు 45,224 ఎకరాలు, అంటే మొత్తం సాగుభూమిలో 3.04శాతం భూమికి మాత్రమే నీటిపారుదల సౌకర్యం ఉందన్నారు. 14 సంవత్సరాల క్రితం ప్రారంభమైన హెచ్చెల్సీ ఆధునికీకరణ అంతులేని నిర్లక్ష్యానికి గురైందన్నారు. 2012 నుంచి హంద్రీనీవా నీరు జిల్లాకు వస్తున్నా ఇప్పటివరకూ పంట కాలువలు లేవన్నారు. సాగునీటి సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు బస్సుయాత్ర, 21న కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతాంగం పెద్దసంఖ్యలో పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, నల్లప్ప పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలి

● భారీ వర్షాలు కురుస్తాయ్.. జాగ్రత్తగా ఉండండి
● అధికారుల సమీక్షలో కలెక్టరు వినోద్ కుమార్



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదికకు వచ్చే ప్రతి బాధితుడి సమస్యను పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులకు కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. పలువురు బాధితులు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టరుతో పాటు డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టరు ఆనంద్ తదితరులు 253మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదులు పెండింగ్ ఉండకుండా సకాలంలో పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జనరేటర్ బ్యాకప్ ఉండాలి..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలోను జనరేటర్ బ్యాకప్ ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్డీఓ కార్యాలయాలలోను, కలెక్టరేట్‌లోను బ్యాకప్ జనరేటర్ ఉండాలన్నారు. వీటి పర్యవేక్షణ కోసం ఓ ప్రత్యేక ఇన్‌చార్జ్‌ను నియమించాలని ఆదేశించారు.

రేపు, ఎల్లుండి విద్యాసంస్థలకు సెలవు

ఈనెల 16, 17 తేదీలలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. వాతావరణం బాగుంటే సెలవులను రద్దు చేస్తామన్నారు. కలెక్టరేట్‌లోను, అన్నిమండల కేంద్రాలలోను ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈనెల16, 17 తేదీలలో పల్లెపండుగ కార్యక్రమాల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుకొని వాయిదా వేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రమాదకరం గా ఉన్న బ్రిడ్జిలు, భవనాలను గుర్తించాలని అక్కడకు ఎవరిని వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టుప్రాంతాలను గుర్తించి ఎక్కడా జనం ఇబ్బందులు పడకుండా, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ట్యాంకులను తహసీల్దార్, మైనర్‌ఇరిగేషన్‌శాఖ అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఆట్యాంకుల వద్ద వీఆర్‌ఓ, వీఆర్ఏలను పర్యవేక్షణకు నియమించాలని ఆదేశించారు. వర్షాల గురించి ముందుగానే గ్రామాలలో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సమా వేశంలో జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వ్యవసాయశాఖ జేడీ ఉమా మహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, ఎల్‌డీఎం నర్సింగరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.బీ.దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి.. మహిళ

- పల్లె పల్లెలో ఆమె వెలుగులే..!
- కుటుంబ సౌధానికి మూల స్తంభం
- నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం

వ్యవసాయం మన జీవన విధానం. భారత దేశ నిర్మాణం బలమైన పల్లెటూళ్ల పునాదుల మీదే జరిగింది. ఆ పల్లెల ప్రగతి వెనుక పైకి కనిపించని నారీ శక్తి కఠోర శ్రమ ఉంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అయినా, విచ్ఛిన్నం తరువాత ఏర్పడిన చిన్న కుటుంబం అయినా.. ఆమె లేనిదే మనుగడ సాగించలేదన్నది వాస్తవం. వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగం.. ఇలా ఏ రంగంలోనైనా ఆమె పాత్ర ఉండి తీరుతుంది. కుటుంబం విషయంలో అతను లేకపోయినా ఆమె ఏదైనా సాధించగలదు. కానీ ఆమె లేకుండా అతను గడపలేడు. కుదేలైపోతాడు. ఇందుకు పెద్దగా శోధన అవసరం లేదు. సమీప సమాజాన్ని గమనిస్తే ఇట్లే అర్థమౌతుంది. గ్రామీణ మహిళ శ్రమ గురించి చర్చ జరగాలి. లింగ సమానత్వం అంశం లో ఆమెకు జరుగుతున్న అన్యాయంపైనా చర్చ జరగాలి. వారి విజయాలపైనా చర్చ జరగాలి. అప్పుడే ఆమెకు తగిన గౌరవం, గుర్తింపు లభిస్తాయి. నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం. ఈ సందర్భంగా భర్తను కోల్పోయినా.. మొక్కవోని ధైర్యంతో బిడ్డలను ఉన్నతంగా తీర్చిదిద్దిన ముగ్గురు మహిళల జీవితాలపై కథనం.

అమ్మంటే అమ్మే..!

- కూలి పనులతో కుటుంబ పోషణ
- పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన బిడ్డలు



పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి కల్పిస్తున్న ఆదిలక్ష్మమ్మ కుమారులు

యాడికి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం రాయలచెరువుకు చెందిన కాడె ఆది లక్ష్మమ్మ, సుబ్బరాయుడు దంపతులకు నలుగురు కుమారులు, ఒక కూతురు. సుబ్బరాయుడు చిన్నపాటి కల్లు దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. 1989లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో ఐదుగురు బిడ్డలను పోషించే బాధ్యత, వారి భవిష్యత్తును తీర్చి దిద్దాల్సిన ఆదిలక్ష్మమ్మపై పడింది. అనుకోని సంఘటనతో భవిష్యత్తు అంధకారంగా మారింది. అయినా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగింది. భర్త నిర్వహించిన కల్లు దుకాణాన్ని కొనసాగిస్తూనే.. కూలి పనులకు వెళ్లేది. కొడుకులకు అక్షర జ్ఞానం అబ్బే పాఠశాల చదువులను మాత్రమే చెప్పించింది. ఆ తరువాత జీవిత పాఠాలను మాత్రం అత్యంత ఉన్నతంగా నేర్పించింది. వారు కాస్త చేతికి రాగానే, నిమ్మకాయల విక్రయానికి వాడే సంచుల వ్యాపారం వారిచేత మొదలు పెట్టించింది. ఆ తరువాత ఇతర వ్యాపారాలలోకి పంపి.. వెనకుండి నడిపించింది. పెద్ద కుమారుడు వెంకటరమణ గౌడ్ నిమ్మకాయల మండి ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డాడు. మిగిలిన ముగ్గురు కుమారులు లక్ష్మీనారాయణగౌడ్, బాబుగౌడ్, శేఖర్‌గౌడ్ గనుల వ్యాపారంలోకి దిగారు. డోలమైట్ ఖనిజ ఎగుమతులు చేస్తూ పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు. వందమందికి పైగా కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. 'మా అమ్మ కూలి పనులు చేస్తూ మమ్మల్ని పోషించింది. మా భవిష్యత్తు కోసం తను ఎంతో కష్టపడింది. ఆమె కష్టాలను చూస్తూ పెరిగాము. పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగాము..' అని నలుగురు కొడుకులు కన్నతల్లి గురించి గొప్పగా చెప్పుకున్నారు. కూతురుకు మంచి సంబంధం చూసి వివాహం జరిపించింది. భర్త దూరమైన తరువాత మొక్కవోని విశ్వాసంతో ముందుకు సాగి.. బిడ్డల ఎదుగుదలకు బలమైన పునాది వేసింది ఆదిలక్ష్మమ్మ.

ఇంతకంటే ఏం కావాలి..?



1989లో నా భర్త చనిపోయాడు. నలుగురు కుమారులు, కూతురును ఎలా పోషించాలో అర్థం కాలేదు. కల్లు దుకాణాన్ని కొనసాగిస్తూనే కూలి పనులకు వెళ్లాను. పిల్లలను క్రమశిక్షణగా పెంచాను. ఇప్పుడు వారు ప్రయోజకులు అయ్యారు. ఫ్యాక్టరీలు పెట్టి పదిమందికి ఉపాధి కల్పిస్తున్నారు. అది నాకు చాలా సంతోషం కలిగిస్తోంది. ఎవరి జీవితాలు వారు గడుపుతున్నారు. నా భర్త మరణించాక కుంగిపోయి ఉంటే నా బిడ్డలు ఏమయ్యేవారో..! ఇలా ఉన్నతస్థాయికి ఎదిగేవారు కారేమో. చేతనైన పనిచేసుకుంటూ వారిని ప్రయోజకులుగా మార్చాను. ఇంతకన్నా నాకు ఏమి కావాలి..?

-ఆదిలక్ష్మమ్మ, రాయలచెరువు

అమ్మ శ్రమ.. బిడ్డల విజయం స్ఫూర్తిదాయకం.. ఈశ్వరమ్మ జీవితం

యాడికి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం పెద్దపేట గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, శ్రీనివాసులు దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. ఎనిమిదేళ్ల క్రితం శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందాడు. ముగ్గురు బిడ్డలతో ఈశ్వరమ్మ జీవితం అగమ్యగోచరంగా మారింది. భర్తను కోల్పోయిన బాధ, బిడ్డల భవిష్యత్తు ఏమౌతుందో అనే దిగులు ఆమెను వెంటాడింది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు సొంతూరిలోనే ఉపాధి మార్గాన్ని ఎంచుకుంది. పాడిపశువులు, గొర్రెలు, కోళ్ల పెంపకంతో ఆదాయాన్ని సమకూర్చుకోవడం ప్రారంభించింది. ఎన్ని కష్టాలు ఎదురైనా బిడ్డలను చదువుకు దూరం చేయలేదు. పెద్దకుమారుడు పవన్‌కుమార్ డిగ్రీ పూర్తి చేశాడు. ఆ తరువాత ఆర్డీటీ సహకారంతో డిప్లొమో ఇన్ ఫారిన్ లాంగ్వేజ్ (జర్మన్) కోర్సు చేయించింది. ఇప్పుడు పవన్ హైదరాబాద్‌లో డీబోల్ట్ నెక్స్‌ఫ్ సంస్థలో ప్రాసెస్ సూపర్‌వైజర్‌గా,



పెద్దకుమారుడు పవన్‌కుమార్ వివాహంలో ఈశ్వరమ్మ కుటుంబం



చిన్న కుమారుడు వెంకటేష్, కుమార్తె వెంకటేశ్వరితో ఈశ్వరమ్మ

మంచి వేతనంతో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు వెంకటేష్ కూడా డిగ్రీతోపాటు డిప్లొమో ఇన్ ఫారిన్ లాంగ్వేజ్ (స్పానిష్) పూర్తి చేశాడు. బెంగళూరులోని లైఫ్ సైన్స్ సంస్థలో రీజనల్ సీనియర్ అనలిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు వెంకటేశ్వరీ బెంగళూరులోని ప్రముఖ బ్యాంకులో మంచి వేతనంతో ప్రాసెస్ సీనియర్ అనలిస్ట్‌గా ఉద్యోగం చేస్తోంది. ఒక పల్లెటూరి మహిళ.. భర్తను కోల్పోయినా, బిడ్డల బాధ్యతను నెత్తికెత్తుకుని మొండి ధైర్యంతో ముందుకు సాగింది. బిడ్డలు ముగ్గురూ ఉన్నతంగా ఎదిగి.. అమ్మ శ్రమకు తగిన ఫలితాన్ని ఇచ్చారు.

నా కష్టం పిల్లలకు వద్దని..

చిన్నప్పటి నుంచి కష్టాలలో పెరిగాను. వ్యవసాయ పనులకు వెళ్లేదాన్ని. నా భర్త అకాలమరణంతో ముగ్గురు బిడ్డలను ఎలా పోషించుకోవాలో అని బాధపడేదాన్ని. మా అన్న ధైర్యం చెప్పారు. పిల్లలకోసం కష్టాలను ఎదుర్కోవాలని అన్నారు. అన్న చెప్పినట్లుగా పిల్లల కోసం రేయింబవళ్లు కష్టపడ్డాను. పశువులు, గొర్రెలు, కోళ్లను పెంచాను. పిల్లలను బాగా చదివించుకున్నాను. ఇప్పుడు వారు ప్రయోజకులయ్యారు. ముగ్గురూ వారివారి ఉద్యోగాలు చేసుకుంటూ సంతోషంగా, సుఖంగా ఉన్నారు. పెద్ద కుమారునికి వివాహం చేశాను. ఇంతకన్నా ఆనందం ఏముంటుంది..?



ఈశ్వరమ్మ, పెద్దపేట, యాడికి మండలం

కన్న బిడ్డల కోసం.. కన్నీటిని దిగమింగి.. జీవితాన్ని గెలిచిన అరుణ

విడపనకల్లు: విడపనకల్లు మండలం పొలికి గ్రామానికి చెందిన అరుణకు గుత్తికి చెందిన రంగనాయకులుతో 1992లో వివాహం జరిగింది. ఎనిమిదేళ్ల అనంతరం బ్రెయిన్ ట్యూమర్‌తో రంగనాయకులు మృతిచెందారు. ముగ్గురు పిల్లలతో అరుణ దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంది. గుండె దిటవు చేసుకుని జీవన పోరాటాన్ని ప్రారంభించింది. చిన్న వయసులోనే భర్త మృతి చెందడంతో కొందరు రెండో పెళ్లి ఆలోచన చేయమన్నారు. కానీ బిడ్డలే తన సర్వస్వం అనుకుంది అరుణ. కన్నీటిని దిగమించుకుని ముందుకు సాగింది. అత్తారింటిలో ఆదరణ కరువై.. పుట్టింటికి చేరుకుంది. తల్లిదండ్రులు, తోబుట్టువులు ఆమెను అక్కున చేర్చుకున్నారు. ఇంటర్ వరకు మాత్రమే చదివిన ఆమె.. ఉపాధి కోసం కుట్టు పని నేర్చుకుంది. దుస్తులు కుడుతూ, పది మందికి కుట్టు నేర్పుతూ బిడ్డలను పోషించడం ప్రారంభించింది. ఆ తరువాత చిన్నగా దుస్తుల వ్యాపారం, మహిళలకు కావాల్సిన వస్తువుల విక్రయాన్ని ప్రారంభించింది. అలా సంపాదించిన సొమ్ముతో కొడుకు సుధీర్ కుమార్, కూతుళ్లు పావని, రమ్యను చదివించింది. ఒక దశలో ముగ్గురి చదువు భారం కావటంతో ఎమ్మిగనూరులో ఉన్న తన చెల్లెలు సుగుణ సాయం తీసుకుంది. కూతుళ్లను కొన్నేళ్లపాటు ఆమె వద్ద ఉంచి చదివించింది. ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదురైనప్పుడు ఆమెకు అన్న, ఇద్దరు చెల్లెళ్లు తోడుగా నిలిచారు.



ఆశాగా పని చేస్తున్న అరుణ

టీడీపీ హయాంలో ఉద్యోగం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో.. పదేళ్ల క్రితం అరుణకు ఆశా వర్కర్‌గా పొలికిలోనే ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమె ఆర్థిక ఇబ్బందులు కొంత తగ్గాయి. ఆశా కార్యకర్తగా గ్రామస్థులకు సేవలు అందిస్తూనే.. తీరిక సమయంలో ఇంట్లో కుట్టు పనులను కొనసాగిస్తోంది. పావనిని ఇంటర్ వరకూ చదివించింది. రమ్యను డిగ్రీ పూర్తి చేసింది. ఇద్దరు కూతుళ్లకు వివాహం జరిపించింది. వారికి మంచి జీవితాలను అందించింది. కొడుకు సుధీర్ కుమార్ బీటెక్ పూర్తి చేసి.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యాడు. హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడు. ఏటికి ఎదురీదిన అరుణ.. బిడ్డలకు మంచి జీవితాన్ని ఇచ్చింది.



కుట్టు మిషన్‌పై అరుణ

పుట్టింటి ఆదరణతోనే..



నేను భర్తను కోల్పోయిన తరువాత అత్తమామల నుంచి పెద్దగా ఆదరణ దొరక లేదు. నా ముగ్గురు పిల్లల్ని తీసుకుని పుట్టింటికి చేరుకున్నాను. అమ్మ, నాన్న, తోబుట్టువులు నన్ను ఆదరించారు. ఒకరికి భారం కాకూడదని అమ్మానాన్నల సహకారంతో కుట్టు మిషన్ నేర్చుకున్నాను. కుట్టు, అల్లికలు నేర్పుతూ 15 సంవత్సరాలు కాలం గడిపాను. పదేళ్ల క్రితం ఇదే గ్రామంలో ఆశా వర్కర్‌గా ఉద్యోగంలో చేరాను. గ్రామస్థులకు నా వంతుగా సేవ చేస్తున్నాను. కష్టాలను ఎదుర్కొంటూనే ముగ్గురినీ శక్తి మించి చదివించాను. నాకు ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు నా తోబుట్టువులు ఆదుకున్నారు. ఎంతో కష్టపడి ఇద్దరు కూతుళ్లకు వివాహం జరిపించాను. నా కొడుక్కి వివాహం చేస్తే నా బాధ్యత తీరిపోతుంది.

-అరుణ

శ్రీకారం

- సాగునీటి సంఘాల బలోపేతానికి చర్యలు
- సంఘాలకు ఎన్నికల నిర్వహణకు సిద్ధం
- ప్రాజెక్టుల వారీగా ఆయకట్టు రైతుల జాబితా సిద్ధం
- రేపటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- 194 సంఘాలకు ఎన్నికలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈక్రమంలోనే వాటి ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి సంఘాలు పూర్తిగా నిర్వీర్యమైపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈనెల 16 నుంచి నవంబరు 24లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల పరిధిలోని ఆయా ప్రాజెక్టులు, ఆయా డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. సాగునీటి సంఘాల ఏర్పాటుతో ఆయకట్టు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది.

హెచ్చెల్సీ పరిధిలో 99 సాగునీటి సంఘాలు

తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలువ (టీబీపీ హెచ్చెల్సీ) పరిధిలో 99సాగునీటి సంఘాలను గుర్తించారు. వీటి పరిధిలో 2,70,809 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో హెచ్‌ఎల్‌ఎంసీ 11 సాగునీటి సంఘాల పరిధిలో 35,541 ఎకరాల ఆయకట్టు ఉంది. మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ 5 సంఘాలకు 13,325 ఎకరాలు, మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్‌కు 10 సంఘాలకు 29,577ఎకరాల ఆయకట్టు ఉంది. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ కింద 25,478ఎకరాల ఆయకట్టుకు 9 సంఘాలు ఉన్నాయి. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 11సంఘాల కింద 32,072 ఎకరాలు, కర్నూలు జిల్లాలోని ఆలూరు బ్రాంచ్ కెనాల్ 14,255 ఎకరాల ఆయకట్టుకు 6 సంఘాలు ఉన్నాయి. కడప జిల్లాలోని జమ్ములమడుగు 10సంఘాలకు 22,625ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రొద్దుటూరు 10 సంఘాలకు 24,524ఎకరాలు ఉంది. ఎర్రగుంట్ల 9సంఘాలకు 23,392 ఎకరాలు, కసనూరు 5 సంఘాలకు 8,843ఎకరాలు, సింహాద్రిపురం 8 సంఘాలకు 24,670ఎకరాలు, ఆచ్చవల్లి 5 సంఘాలకు 16,507ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తంగా అనంతపురం జిల్లాలో 5డిస్ట్రిబ్యూటరీ సంఘాల పరిధిలో 46సాగునీటి సంఘాలు, కర్నూలు ఒక డిస్ట్రిబ్యూటరీ కింద 6 సాగునీటి సంఘాలు, కడపలో 6 డిస్ట్రిబ్యూటరీల కింద 47సాగునీటి సంఘాలు ఉన్నాయి. మొత్తం హెచ్చెల్సీ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీల కింద 99 సాగునీటి సంఘాలను గుర్తించారు.



తుంగభద్ర ఎగువ కాలువ

మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 సాగునీటి సంఘాలు...

మైనర్ ఇరిగేషన్ పరిధిలో జిల్లాలో 95 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో మేజర్ ప్రాజెక్ట్‌గా భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్టు కింద 6, చెరువులు 89 మొత్తం 95సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కో అసోసియేషన్‌కు 20-50 ఎకరాల ఆయకట్టు రైతులు ఓటర్లుగా టీసీ(టెరిటోరియల్ కానిస్టిట్యూయన్సీ) ని ఎన్నుకుంటారు. టీసీలు కనీసం 6-12 మంది కలిసి వాటర్ యూజర్ అసోసియేషన్‌లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు. సాగునీటి సంఘాలు కలిసి ప్రాజెక్టు అసోసియేషన్‌ను ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ మొత్తం ఈనెల 16 నుంచి నవంబరు 24లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

సాగునీటి సంఘాలను తొక్కేశారు



ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి సంఘాలను తొక్కేశారు. ఆయకట్టు రైతులు ఎక్కడా మాట్లాడకుండా నోరు నొక్కేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా సాగునీరివ్వాలని అడగకుండా సంఘాలనే లేకుండా చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆయకట్టుదారుల సమస్యలను గుర్తించి, రైతుల ఐక్యతను చాటేందుకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలనుకోవడం శుభపరిణామం. సాగునీటి సంఘాల ఎన్నికలకు ఆయకట్టుదారులు పూర్తి మద్దతు తెలుపుతున్నారు. ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం. అధికారులకు పూర్తిగా సహకరిస్తాం.

- బాలకృష్ణ, సౌత్‌కెనాల్ మాజీ ఉపాధ్యక్షుడు

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం



హెచ్చెల్సీ, మైనర్ ఇరిగేషన్ పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆయకట్టుదారులు, సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీల వారిగా ఓటర్ల జాబితా తయారు చేశాం. ఓటర్ల జాబితాను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేశాం. ఈనెల 16 నుంచి నవంబరు 24లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ అధికారులతో కలిసి సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ సాగుతుంది.

- రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ, సాగునీటి సంఘాల ఎన్నికల నోడల్ అధికారి

కార్పొరేట్ కంపెనీలను రద్దు చేయాలి

నగరంలో ఆటోడ్రైవర్ల ర్యాలీ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల పొట్టకొడుతున్న రాపిడో బైక్స్, ఓలా, ఉబెర్, బ్లాబ్లా వంటి కార్పొరేట్ కంపెనీలను రద్దు చేయాలని ఏఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌టీయూ న్యూ అనుబంధం ఆటోడ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్జీఓ హోం నుంచి క్లాక్‌టవర్, సుభాష్‌రోడ్డు, సప్తగిరిసర్కిల్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆటోలనే నమ్ముకుని జీవిస్తున్న కార్మికుల పొట్టకొడుతున్న కార్పొరేట్ కంపెనీలను నివారించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలపై అసెంబ్లీ, పార్లమెంట్‌లలో చర్చించి పాలకులు న్యాయం చేయాలని కోరారు. వ్యక్తిగత వాహనాలను వ్యాపారానికి వాడకుండా చూడాలని, ర్యాపిడో బైకులను ఆటోస్టాండ్‌కి దగ్గరగా రాకుండా ఉంచి, ఘర్షణ వాతావరణాన్ని నివారించాలని కలెక్టర్, ఆర్టీఓలను కోరారు. వ్యాపారాలకు ఉపయోగించే వాహనాలకు తెల్లనంబరు ప్లేట్ల స్థానంలో పసుపు రంగువి వాడేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నాయకులు చంద్రశేఖర్, రాజా, హాజీవలీ, సుధాకర్, నాగభూషణం, మల్లేశ్వరి పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఆటోకార్మికులు

ఏటీఎంలో చోరీకి యత్నం

నార్పల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బ్రిడ్జి వద్ద ఉన్న ఏటీఎంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారు. సెక్యూరిటీ లేకపోవడాన్ని గుర్తించిన దుండగులు ఏటీఎం లోపలి భాగంలో ఉన్న బాక్స్‌ను పగలగొట్టారు. ఎంత ప్రయత్నించినా లోపల ఉన్న చిన్న బాక్స్ రాకపోవడంతో వారు చోరీ యత్నాన్ని విరమించుకున్నారు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంను పిలపించి వేలిముద్రలు సేకరించారు. స్టేట్ బ్యాంక్‌కు వెళ్లి సీసీ కెమెరాలు పరిశీలించారు. ఏటీఎంలో ఎంత నగదు ఉందని బ్యాంకు సిబ్బందిని ప్రశ్నించారు. ఏటీఎంలో రూ.35వేలు మాత్రమే ఉందని, ఎలాంటి నగదు పోలేదని బ్యాంక్ అధికారులు వెల్లడించారు. ఇది దొంగల పనికాదని, ఆకతాయిల పనేనని, సీసీ కెమెరాలు పరిశీలించామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

3 నుంచి ప్రభుత్వ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఏపీ వెటరన్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్టు అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. ఆర్డీటీ స్టేడియంలో నవంబరు 3 నుంచి టోర్నీ ఉంటుందన్నారు. సెలవు దినాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 23లోపు ఆసక్తి ఉన్న ఉద్యోగులు తమ ఎంట్రీలను పంపాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9490062555, 7386958666లను సంప్రదించాలని కోరారు.

గల్లంతైన విద్యార్థి మృతి

కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి సవిత

పెనుకొండ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్‌లోపడి ఆదివారం గల్లంతైన చంద్రశేఖర్‌రెడ్డి(19)అనే విద్యార్థి మృతదేహం సోమవారం లభ్యమైంది. పెనుకొండ మండలం అమ్మవారిపల్లికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి అనే డిగ్రీ విద్యార్థి తోటి స్నేహితులతో కలిసి ఈత కోసం ఆదివారం మధ్యాహ్నం గొల్లపల్లి రిజర్వాయర్‌కు వెళ్లారు. రిజర్వాయర్‌కు వస్తున్న కాలువలో ఈత కొడుతుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సోమవారం ఉదయం 10గంటల సమయంలో మృతదేహం నీటిలో తేలింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖల మంత్రి సవిత సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మంత్రి వెంట టీడీపీ నాయకులు చిన్నవెంకటరాముడు, పోతిరెడ్డి పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత

కంటైనర్‌ను ఢీకొట్టిన కారు

నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు తీవ్రగాయాలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కంటైనర్‌ను కారు ఢీ కొన్న సంఘటన మండలంలోని యర్రంపల్లి సమీపంలో సోమవారం ఉదయం జాతీయ రహదారిపై జరిగింది. ఈ ప్రమాదంలో కర్ణాటకకు చెందిన నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు....కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన వీరేశ్, సంగనాథ్, సిద్దలింగ, హరీశ్‌లు గుల్బర్గా నుంచి కారులో బెంగళూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో యర్రంపల్లి సమీపంలోకి రాగానే కారు ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఆపి ఉన్న కంటైనర్ వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. కాగా ప్రమాదంలో కారు నుజ్జునుజ్జైంది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



కంటైనర్ వెనుక భాగంలో ఇరుక్కున్న కారు

ఉరుసు ప్రారంభం

ధర్మవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేట రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న అజీమ్ ఆల్ సుల్తాన్ మైనార్టీ ట్రస్టు 46వ ఉరుసు మహోత్సవ వేడుకలను సోమవారం నుంచి ప్రారంభించామని ఆ ట్రస్టు అధ్యక్షుడు నాసిర్ అహమ్మద్ తెలిపారు. 16వ తేదీ వరకు ఈ ఉత్సవాలు (మూడు రోజులు) నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు దర్గాలో సమాధికి ప్రత్యేక పూజలు, అనంతరం గంధంతో వేడుకలు నిర్వహించామన్నారు. అదేవిధంగా 15న ఉరుసు, 16న జిహారత్‌తో ఈ వేడుకలు ముగుస్తాయన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ

ముదిగుబ్బ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జిల్లా విద్యుత్ ఎస్‌ఈ సురేంద్ర సోమవారం తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు, రైతులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని పలు విద్యుత్ సమస్యలను ఇన్‌చార్జి ఏఈ శివతేజను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా వసంతోత్సవం

ధర్మవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేపీటీ వీధిలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం వసంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వాసవీమాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రంగులు చల్లుకుంటూ వసంతోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం రాత్రి ఏడు గంటలకు ఆర్యవైశ్య కొత్తసత్రంలో అమ్మవారికి ఉయ్యాలో సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవీ మహిళా మండలి సంగీత కీర్తనలు నిర్వహించారు.



వసంతోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యసంఘం సభ్యులు

ఎల్‌ఐసీ ఏజెంట్ల నిరసన

కదిరి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు, ఏజెంట్లు సోమవారం నిరసన చేపట్టారు. ఏజెంట్ల మనుగడను దెబ్బతీసేలా అమలులోకి తెచ్చిన పాలసీ విధానాలను వెంటనే రద్దు చేయాలన్నారు. బలహీన వర్గాలకు అందుబాటులో ఉన్న రూ. లక్ష పాలసీని రద్దు చేయడం అన్యాయమన్నారు. ఏజెంట్లకు తగ్గిన కమీషన్లు తిరిగి యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నారాయణరెడ్డి, నగేష్, ఏజెంట్లు పాల్గొన్నారు.



కదిరి ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నాయకులు, ఏజెంట్ల నిరసన

సచివాలయ భవనం స్వాధీనం

కదిరి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలచెరువు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ పోలప్ప సోమవారం స్వాధీనం చేసుకున్నారు. భవనం నిర్మించి నెలలు గడుస్తున్నా.. బిల్లులు అందలేదని సచివాలయ భవనాన్ని కాంట్రాక్టర్ ప్రభుత్వానికి అప్పగించలేదు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాలతో ఎంపీడీఓ ఆ గ్రామానికి వెళ్లి సచివాలయం తాళాలు తీసి స్వాధీనం చేసుకున్నారు.



సచివాలయానికి తాళం తీస్తున్న ఎంపీడీఓ

ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్-19 కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. అన్ని పోటీలు బాల, బాలికల క్యాటగిరీలో ఉంటాయని తెలిపారు. హ్యాండ్‌బాల్ పోటీలు ఈ నె 20న ప్రభుత్వ న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో, 22న రుద్రంపేటలోని నారాయణ టెన్నిస్ అకాడమీలో టెన్నిస్, సాఫ్టటెన్నిస్ క్రీడా పోటీలు ఉంటాయన్నారు. అలాగే 23న ప్రభుత్వ న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో త్రోబాల్, టెన్నీకాయిట్, క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24న న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో సైక్లింగ్, మాల్కమ్ పోటీలు, 25న విద్యారణ్యస్కూల్‌లో ఆర్చరీ, 26న అశోక్‌నగర్ డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 30న ఎస్కేయూ సమీపంలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్విమ్మింగ్, నవంబరు 1న అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో జిమ్నాస్టిక్, బాక్సింగ్ పోటీల నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, 2006 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, పదోతరగతి మార్కుల జాబితా, ప్రిన్సిపాల్ లేదా హెచ్‌ఎంతో స్టడీసర్టిఫికెట్, క్రీడాసామాగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబరు 9441284618ను సంప్రదించాలని కోరారు.

వేతన బకాయిలు చెల్లించాకే టెండర్లు పిలవాలి

● శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ వర్క్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికుల వేతన బకాయిలు, పీఎఫ్ చెల్లించాకే నూతన టెండర్లు పిలవాలని ఆ తాగునీటి పథకాల కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ సప్లై స్కీమ్‌లకు టెండర్లు జరుగుతున్న నేపథ్యంలో వాటిలో కార్మిక సంక్షేమ చట్టాలు అమలయ్యేలా చూడాలన్నారు. పీఎఫ్, గ్రాట్యుటీ, ఈఎస్‌ఐ, బోనస్, సమానపనికి సమాన వేతనం అమలయ్యేలా టెండర్లలో పొందుపరచాలన్నా రు. స్కీమ్‌లో పనిచేసి రిటైర్డ్ అయిన 42 మంది కార్మికులు, చనిపోయిన ఆరుగురు కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. 2021 నుంచి బోనస్ చెల్లించకుండా వాయిదా వేస్తూ వస్తున్నారని, చెల్లించే ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఈశ్వరయ్య, కార్యదర్శి శ్రీనివాసులు, చిన్న, త్రిలోక్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఓబులు

ఫాస్ట్‌గా రోగాలు



ఇటీవల కాలంలో విదేశీ సంస్కృతి విపరీతంగా పెరిగింది. శనివారం, ఆదివారం వచ్చిందంటే చాలు ఇక కుటుంబాలతో బయటకు వెళ్లి.. తినడం అలవాటుగా మారింది. రుచే తప్పా... శుచి చూడకుండా ప్రజలు ఎగబడి మరీ తింటున్నారు. రోడ్డు సైడ్ ఫాస్ట్‌ఫుడ్, కబాబ్ సెంటర్లు మొదలు కొని.. హోటళ్లు, రెస్టారెంట్లు సైతం కిటకిటలాడుతున్నాయి. పండగలు వస్తే పిండి వంటలను సైతం బయటి నుంచి తెప్పించుకుంటున్నారు. లాభాలే తప్పా.. ప్రజారోగ్యం పట్టని వ్యాపారులు ఆహార పదార్థాలను కల్తీ.. నాసిరకం వాటితో తయారు చేసి.. జేబులు నింపుకున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న దాన్ని మరిచి .. బయటి పదార్థాలు తింటూ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

ఫాస్ట్‌ఫుడ్ కల్చర్...

- గ్రామాలకు సైతం విస్తరించిన వైనం
- బయటి ఆహార పదార్థాల వైపు మొగ్గు
- రుచే తప్పు.. శుచి చూడని జనాలు
- లాభాలే తప్పు.. ప్రజారోగ్యం పట్టని వ్యాపారులు
- ఆహార పదార్థాల్లో కనిపించని నాణ్యత
- కానరాని ఆహార తనిఖీ అధికారులు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అబ్బా ఏమి టేస్టరా... అంటూ ప్రజలు రుచికే తప్పా.. ఆరోగ్యం గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా నేడు బయటి ఆహార పదార్థాలకు అలవాటు పడ్డారు. అందంగా కనిపించి.. రుచిగా ఉంటే చాలు లొట్టలేసుకుంటూ లాగిస్తున్నారు. మరుగుతున్న నూనెలో మెరపకాయ బజ్జీలు మొదలుకుని పూరీలు వరకు దంచిపడేస్తున్నారు. హోటళ్ల సమీపంలో వెళ్తుంటే వస్తున్న మసాలా వాసనకు ముగ్ధులైపోయి అటువైపు అడుగులు వేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్, కబాబ్ సెంటర్లకు క్యూ కడుతున్నారు. ఇది ప్రస్తుత సమాజంలో మామూలైంది. ఆరోగ్యమే మహాభాగ్యమన్న మాట మరిచిన జనం.. వాటిని ఎగబడి తింటూ 30 ఏళ్లకే పలు రోగాల బారిన పడుతున్నారు.



కనిపించని నాణ్యత

కంటికి ఇంపుగా కనపడితే చాలు ఆహారంలో ఏ మాత్రం నాణ్యత ప్రమాణాలు లేకపోయినా జనం ఫాస్ట్‌ఫుడ్, కబాబ్ సెంటర్ల వద్ద బారులు తీరుతున్నారు. ఒకసారి కాచిన నూనె మళ్లీ ఉపయోగించరాదు. అది చాలా ప్రమాదం. అయితే ఎక్కడా కూడా ఇది అమలు కావడం లేదు. వారాల తరబడి వాడిన నూనెనే వాడుతున్నారు. దీంతో అనారోగ్యహేతువైన టీపీసీ స్థాయి 65 శాతం పైబడుతోంది. సాధారణంగా నూనెలో టీపీసీ శాతం 25కు మించకూడదు. కాని ఈ చర్యలను ఎవరూ కూడా పెద్దగా పట్టించుకున్న పాపాన పోవడంలేదు. 65 శాతం కంటే ఎక్కువ టీపీసీ ఉన్న నూనెలను ఉపయోగించి తయారుచేసే ఆహారపదార్థాలతో కేన్సర్ తదితర భయంకర రోగాలకు గురికావాల్సిందే. మరిగే నూనె గురించి మనకు పట్టదు. వేడివేడిగా ఉన్నాయా లేదా అని మాత్రమే చూస్తాం. నూనె కాచి.. కాచి.. నల్లగా మారినా పట్టించుకోకుండా.. వేడి వేడిగా ఉంటే చాలు అని తినేస్తున్నారు. స్వీట్ స్టాళ్లలో కలుపుతున్న రంగులు కారణంగా తయారుచేసే పదార్థాలు పదిరోజులైనా తాజాగా కనిపిస్తాయి. వీటిని తయారీలో సైతం నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. ప్రస్తుత ప్రజలు బీపీ, షుగర్ వాధ్యుల బారిన పడటానికి ఇదీ ఒక కారణం అవుతోంది.

లాభాలే లక్ష్యంగా..

చాలా మంది వ్యాపారులు లాభా పేక్ష తప్పా.. ప్రజల ఆరోగ్యం గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లాలో పుట్టపర్తి,



హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, కదిరి తదితర పట్టణాలే కాక మారుమూల గ్రామాల్లో సైతం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వెలిశాయి. ఎక్కడ చూసినా ఇబ్బడిముబ్బడిగా డాబాలు, స్వీట్‌స్టాళ్ళ, బేకరీలు వెలిశాయి. పాడైనవాటిని పారేయకుండా వాటిని మరీ మరీ వేడి చేసి తాజాగా కనిపించే విధంగా చేసి అమ్మేస్తున్నారు. చికెన్, మటన్ ఫిష్, ప్రాన్ తదితర వాటిని రోజుల తరబడి ఫ్రిడ్జ్‌ల్లో నిల్వలు చేసి.. మరీ వాడుతున్నారు. రుచి కోసం ఎసెన్సు ఇష్టారీతిన వాడేస్తుండటంతో లివర్ పాడై జీర్ణవ్యవస్థ దెబ్బతినడంతో శరీరంలో అనేక రుగ్మతలు ఏర్పడుతున్నాయి.

కానరాని తనిఖీలు

జిల్లా కేంద్రం పుట్టపర్తే కాక హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, కదిరి తదితర పట్టణాలు మొదలుకుని మారుమూల గ్రామాలకు సైతం ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ పాకింది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, డాబాలు, కబాబ్ సెంటర్లు విపరీతంగా వెలిశాయి. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ఆహార భద్రతా కార్యాలయాన్ని ఏర్పాటు చేసి.. ఒక ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించింది. జిల్లాలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి.. రెండు సంవత్సరాలు కావస్తున్నా ఎక్కడ ఆహార తనిఖీలు... కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బేకరీలు, డాబాలు, కబాబ్ సెంటర్ల వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. పలు కేంద్రాల్లో కల్తీ, నాసిరకం పదార్థాలతో ఆహారాన్ని తయారు చేస్తున్నా.. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పట్టించుకున్న పాపాన పోలేదు. వారికి నెలనెలా భారీ మొత్తంలో డబ్బులు అందుతుండటంతోనే తనిఖీలు చేయడం లేదనే విమర్శలున్నాయి.

రాజీపడం

ఆహార పదార్థాల్లో కల్తీ చేస్తే ఉపేక్షించం. నాణ్యతలో రాజీ పడం. ఆహారపదార్థాల్లో కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాము. ఇప్పటికే డాబాలు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులకు నియమాలు వివరించాం.

-రామచంద్ర, జిల్లా ఆహారభద్రతాధికారి

కుంటను తలపిస్తున్న రహదారి

నల్లమాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ఉదయం కురిసిన చిరు జల్లులకే ప్రధాన రహదారిపై ఇలా నీరు నిల్వ ఉండి.. కుంటను తలపిస్తోంది. వాహనాలు వెళ్లినప్పుడల్లా ఆ నీరు సమీపంలోని ఇళ్లలోకి వస్తున్నాయని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. తప్పనిసరిగా ఆ నీటిలో నుంచే వెళ్లాల్సి వస్తుండటంతో పాదచారులు, బైక్ దారులు జారిపడి గాయపడుతున్నారు. అధికారులకు ఈ సమస్యను పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెడ్డిపల్లి ప్రధాన రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరు



ధర్మవరంలోనే లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

ధర్మవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ధర్మవరంలో లేబర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీవిగ్రహం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ.. ధర్మవరంలో గతంలో అసిస్టెంట్ లేబర్ కార్యాలయం ఉండేదని, కానీ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో సత్యసాయి జిల్లా ఏర్పడిన తరువాత ఇక్కడి లేబర్ కార్యాలయాన్ని కొత్తచెరువుకు మార్చారని అన్నారు. దీంతో ధర్మవరం ప్రాంతంలో వేలాది మంది కార్మికులు లేబర్ కార్యాలయం సేవలకు దూరం అయ్యారన్నారు. ధర్మవరంలో లేబర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయకపోతే భవిష్యత్తులో ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, కార్మికులు పుల్లన్న, వెంకటేశ్, వెంకట్రాముడు, పెద్దక్క, ముకుంద, జయమ్మ, చౌడమ్మ,నాగవేణి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



గాంధీవిగ్రహం ఎదుట నిరసన చేస్తున్న సీఐటీయూ, కార్మికులు

ఉత్సాహంగా పల్లె పండుగ

కొత్తచెరువు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాలను అధికారులు, కూటమి నాయకులు సోమవారం ఉత్సాహం గా నిర్వహించారు. మండల కేంద్రంలో 10 వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ.. మండలంలోని 15 పంచాయతీల్లో రూ.3.30 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, ఏఈకి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని పలు కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ప్రజలు ఫోన్ చేస్తే ఎందుకు స్పందించడం లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని పరిష్కరించకపోతే ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠారెడ్డి, పంచాయతీ జేఈ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ నటరాజ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండుగలో భాగంగా మండల కేంద్రంలో రోడ్డు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దిగువపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి నాయనవారిపల్లి, అలాగే బందారు చెట్లపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కొత్త రోడ్డు సమీపంలో ఉపాధి పథకం కింద రైతు పొలంలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అంజనప్ప, ఈఓఆర్డీ మాధవ రెడ్డి, సర్పంచ్ ఆంజనమ్మ, ఏపీఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి రమేష్‌నాయుడు, క్షేత్రస్థాయి సిబ్బంది లక్ష్మయ్య, బాబు, ఉపాధి సిబ్బంది నరేష్ పాల్గొన్నారు.

గైర్హాజరు

గాండ్లపెంట : మండలంలోని వేపరాల, చామలగొందిలో సోమవారం నిర్వహించిన పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాలకు ముఖ్య అధికారులు గైర్హాజర్ అయ్యారు. ఎంపీడీఓ, ఈఓఆర్డీ , పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు, కనీసం సర్పంచ్ కూడా హాజరుకాలేదు. ఉపాధి ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు వేపరాలోని సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.





కొత్తచెరువులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, ఎన్పీకుంట వద్ద మొక్కలు నాటుతున్న అధికారులు

క్రైం న్యూస్ ..

పట్టుబడ్డ దొంగలు

గాండ్లపెంట, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 14: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి వాసి ఎద్దులకోట నరసింహులుకు చెందిన పొట్టేలును అపహరించడానికి యత్నించిన ముగ్గురు దొంగలను గాండ్లపెంట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా పాతూరు గ్రామానికి చెందిన తిప్పన్న, కుమారుడు రాజేష్, కుమార్తె ఆశ కారులో తంబళ్లపల్లి వచ్చారు. నరసింహులకు చెందిన పొట్టేలును కారులో వేసుకొని వెళ్లిపోయారు. గమనించిన స్థానికులు గాండ్లపెంట పోలీసులకు సమాచారం అందించారు. స్టేషన్ వద్ద జీపును అడ్డంగా ఉంచిన పోలీసులు ఆ దొంగలను అదుపులోకి తీసుకున్నారు. పొట్టేలును నరసింహులుకు అందజేసినట్లు గాండ్లపెంట పోలీసులు భాస్కర్, బాషా, గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

ధర్మవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక తారకరామాపురానికి చెందిన రమేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతను సోమవారం గాంధీనగర్ సర్కిల్‌లో ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. ఆటో ఢీకొంది. గాయపడ్డ అతన్ని స్థానికులు స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి మొక్కల నరికివేత

ధర్మవరం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ రైతు పూజారి నరసింహులు పొలంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 35 మామిడి మొక్కలను నరికివేశారు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన నరసింహులు మామిడి మొక్కలు నరికి వేసి ఉండటాన్ని గమనించి.. ధర్మవరం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎకరాలో మామిడి మొక్కలను రెండేళ్ల నుంచి సాగు చేస్తున్నాని, వాటిని నరికివేయడంతో తనకు రూ. లక్ష వరకూ నష్టం వాటిల్లిందని వాపోయాడు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేక ఉద్దేశ్యపూర్వకంగానే తన బంధువులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని ఆరోపించారు.



నల్లమాడలో అధికారులతో మాట్లాడుతున్న డీఈఓ

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

నల్లమాడ , అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డీఈఓ మీనాక్షి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అలాగే శిథిలావస్థ నివాసా గృహాల్లోని వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ప్రజలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగనాయకులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాబర్టువిల్సన్, పంచాయతీ కాదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

మద్దిలేరు బ్రిడ్జి పరిశీలన

ముదిగుబ్బ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవండ్లపల్లి, గంగిరెడ్డిపల్లి మధ్య ఉన్న మద్దిలేరు బ్రిడ్జి పాక్షికంగా దెబ్బ తిందని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ధర్మవరం ఆర్డీఓ మహేష్ సూచించారు. ఆ బ్రిడ్జిని సోమవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. రాబోయే రెండు రోజుల్లో జిల్లాలో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఆయన వెంట ముదిగుబ్బ డీటీ నారాయణస్వామి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



మద్దిలేరు బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి
హిందూపురం
● హిందూపురం ● పెనుకొండ ● మడకశిర వార్తలు
మంగళవారం 15 అక్టోబరు 2024

దిష్టిబొమ్మలా ఈఎస్ఐ ఆసుపత్రి

● 25 వేలమంది కార్మికులు ● ఇద్దరు వైద్యులకు ఒక్కరే.. అదీ ఇన్‌చార్జ్ ● రోగులను చూసే దిక్కులేదు



అద్దె భవనంలో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి



భవనం లీకేజీతో కారిన వర్షపు నీరు



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

హిందూపురం అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హిందూపురం అంటేనే పారిశ్రామిక వాడ, స్పిన్నింగ్ మిల్లులు, పట్టు పరిశ్రమలు గుర్తుకు వస్తాయి. వేలాది మంది కార్మికులు నిత్యం వివిధ సమస్యలతో ఆసుపత్రికి వస్తుంటారు. వీరందికి వైద్యం అందించడానికి ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. కానీ అది దిష్టిబొమ్మలా దర్శనమిస్తుంది. కార్మికులకు ఏ మాత్రం ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి వైద్యం అందడంలేదు. హిందూపురంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఉందని చెప్పుకోవడానికి మాత్రమే పనికి వస్తుంది. దీని వల్ల కార్మికులకు ఎలాంటి వైద్యం అందలేదని కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. చట్టం ప్రకారం పరిశ్రమల్లో పని చేసే కార్మికుల జీతంలో నుంచి ఈఎస్ఐ కోసం కొంత డబ్బును కోత విధించి జీతాలు చెల్లిస్తుంటారు. కానీ అందుకు అణుగుణంగా వైద్యం అందడంలేదు. ఇంతకు ముందు వంద మంది దాకా ఓపీకి వచ్చేవారు. వైద్యులు అందుబాటులో లేపోవడం, సమయానికి చికిత్స అందక పోవడం, మందులు లేని కారణంగా ఇప్పుడు సగం మంది కూడా రావడంలేదు. ఇక్కడ రెగ్యులర్‌గా ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండాలి. ఒక్క వైద్యుడు కూడా లేరంటే ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కార్మిక సంఘాల ఆందోళనతో మదనపల్లి నుంచి నవీన్ అనే వైద్యుడిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. దీంతో ఆయన రెండు పడవలపైన ప్రయాణం చేస్తున్నారు. హిందూపురానికి ఒక్క రోజు మాత్రమే వచ్చి వెళతారు. దీంతో అవసరానికి కార్మికులకు వైద్యం అందడంలేదు. అనారోగ్యంతో వచ్చే కార్మికులకు కనీసం సూది వేయడానికి ప్రత్యేక గది కూడా లేదు.

సిబ్బందీ కొరతే...

ఒక వైపు వైద్యుల కొరత వేధిస్తుంటే సిబ్బంది కూడా అంతంత మాత్రమే ఉన్నారు. 15 మంది సిబ్బంది ఉండాల్సిన చోట నలుగురు మాత్రమే పని చేస్తున్నారు. ఆసుపత్రికి రాగానే కనీసం చెత్త ఊడ్చేందుకు స్వీపర్‌కూడా లేని దయనీయం నెలకొంది. వాచ్‌మెన్‌లు కూడా లేరు.

కారుతున్న అద్దె భవనంలోనే..

ప్రస్తుతం హిందూపురంలోని అజాద్‌నగర్‌లో ఓ అద్దె భవనంలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. భవనం పాతబడటంతో వర్షం వచ్చిందంటేనే కారుతుంది. మందులు తడిసిపోతున్నాయి. భవనానికి విద్యుత్ సరఫరా అవుతుందని సిబ్బంది భయపడుతున్నారు. గోడలు ముట్టాలంటే షాక్ కొడుతుందని ఆందోళన చెందుతున్నారు.

దుర్గంధభరితంగా మరుగుదొడ్లు

ఆసుపత్రిలో రెండు మరుగుదొడ్లు ఉన్నాయి. అందులో ఒకటి పూర్తిగా నిరుపయోగంగా ఉండిపోయింది. ఉన్న ఒక్కటి దుర్గంధ భరితంగా ఉంది. ఆ ఒక్కదానినే ఆసుపత్రి సిబ్బంది, ఆసుపత్రికి వచ్చే రోగులు వినియోగించుకుంటున్నారు. బాత్ రూంలకు డోర్లు కూడా పడటంలేదు. దీంతో రోగులతో పాటు ఆసుపత్రిలో పని చేస్తున్న మహిళా సిబ్బందికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. తప్పని పరిస్థితుల్లో ఒకరు బాత్‌రూం బయట కాపలా ఉంటే ఇంకొకరు భయం భయంగా బాత్‌రూంకు వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని సమయాల్లో బాత్‌రూంలలో విష పురుగులు కూడా కనిపిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. భవనంపై పిచ్చి మొక్కలు మొలచి లీకేజీ అవుతున్నా అందులోనే కాలం గడపాల్సిన పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

సొంత భవనం నిర్మించాలి



వేలాది మంది కార్మికులు ఉంటున్న హిందూపురం ప్రాంతంలో సొంత ఈఎస్ఐ ఆసుపత్రికి భవనం నిర్మించాలి. వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. మందులు అందుబాటులో ఉంచి సమయానికి అందించాలి. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కార్మికులకు వైద్యాన్ని అందుబాటు లోకి తీసుకురావాలి.

- వినోద్‌కుమార్,
జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఏఐటీయూసీ

గ్రామాల సర్వతోముఖాభివృద్దే ధ్యేయం: ఎమ్మెల్యే



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాలను సర్వతోముఖాభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయం అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గౌడనహళ్లి గ్రామంలో పల్లె పండుగా వారోత్సవాలు నిర్వహించారు. బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధిని పూర్తి విస్మరించారన్నారు. గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న లక్ష్యంతో చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నిల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం గౌడనహళ్లిలో తాగునీటి బోరు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోనియాబాయి, ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్, సర్పంచు పుట్టమ్మ, నాయకులు లక్ష్మీనారాయణ, రంగేగౌడ్, నాగరాజు, డాక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్లపై జగన్ కక్ష

మడకశిర టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటిన్లపై సైతం నాటి సీఎం జగన్ కక్షగట్టి నిర్మాణంలో ఉన్న వాటిని కూడా కూల్చారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అమరాపురం రహదారిలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గత టీడీపీ ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లను ప్రారంభించి రూ.5లకే పేదలకు కడుపునిండా అన్నం పెట్టారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంతో మడకశిరలో పునఃప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, వీఎం పాండురంగప్ప, భక్తర్, దాసిరెడ్డి, నరసింహరాజు, రాధమ్మ, కృష్ణమూర్తి, తిమ్మరాజు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి: డీహెచ్‌ఓ



పంటను పరిశీలిస్తున్న డీహెచ్ఓ చంద్రశేఖర్

అగళి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో మిరప పంట సాగుచేసిన రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం రావుడి గ్రామంలో ఆయన పంటలను పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా పంట దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలాల్లో నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి : ఆర్డీఓ



అధికారులతో సమావేశమైన ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పరిగి/సోమందేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన పరిగి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన మేరకు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని, పాత ఇళ్లు, పాత మిద్దెలలో నివసించే ప్రజలు సురక్షితంగా ఉండాలని, సమీప బంధువుల ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. జయమంగళి నది ప్రవాహం రెండడుగుల వేగంతో పరిగి మండలంలో ప్రవేశిస్తున్న కారణంగా పశువులు, కాపర్లు, నదిని దాటే ప్రయత్నం చేయకూడదని, వీఆర్‌ఓలు ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ హసీనాసుల్తానాకు సూచించారు. అనంతరం వ్యవసాయాధికారులు, పంట పొలాలను కాపాడేవిధంగా రైతులకు సూచనలు చేయాలన్నారు. ట్రాన్స్‌కో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీదేవి, ఎస్ఐ రంగడుయాదవ్, డాక్టర్ స్వరూపారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ నరసింహారెడ్డి, హౌసింగ్ ఏఈ సునీత తదితరులు పాల్గొన్నారు. సోమందేపల్లి తహసీల్దార్ కార్యాలయంలోనూ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ అధికారులతో సమావేశమైన ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

తుఫాన్ ప్రభావంపై ప్రత్యేకాధికారి సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ సమత

గోరంట్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంపై తక్షణ చర్యల కోసం గోరంట్ల ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ అధికారులతో మండల స్పెషలాఫీసర్, డీపీఓ సమత సోమవారం సమావేశం నిర్వహించారు. రాబోవు రెండురోజుల్లో అధిక వర్షాలు పడే అవకాశముందని, శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించి ప్రమాదాలు జగరకుండా గృహనిర్మాణ శాఖాధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్యం నిర్వహిస్తూ, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పంచాయతీలోని ఒక ఉన్నత, ఒక ప్రాథమిక పాఠశాలలో పునరావాసకేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్ర, వైద్యాధికారులు కల్యాణ్, శృతి, మాధవి, ఈఓఆర్డీ శివన్న, హౌసింగ్ ఏఈ గణేష్, ట్రాన్స్‌కో ఏఈ బాలక్రిష్ణనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మోహన్, ఈఓ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల మలుపు

పరిగి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నేతులపల్లి గ్రామ సమీపంలో శిర హైవే వద్ద ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. నేతులపల్లి వైపు నుంచి ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు హైవే దాటుతూ శాసనకోట గ్రామానికి చేరుకోవడానికి కూడలి దాటాల్సి ఉంది. అదే రోడ్డులో ఇండస్ వ్యాలీ ఆగ్రోఫాం రీసార్ట్ అనే బోర్డును వేయడంతో అటువైపుగా వచ్చే వాహనాలు కనబడక పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు హైవేలో ఉన్న బోర్డును తొలగించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.





ప్రమాదాల మలుపులో అడ్డుగా ఉన్న బోర్డులు

'పల్లెపండుగ'లో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పలు గ్రామ పంచాయతీల్లో పల్లె పండుగ వారోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. పలుచోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. లేపాక్షి మండలంలోని అన్ని పంచాయతీ కేంద్రాలలో ఈనెల 19వరకు పల్లె పండగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. కొండూరు, కల్లూరు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. రొద్దం మండలంలోని కోగిర, కంబాలపల్లి, బక్కంపల్లి గ్రామాల్లో పల్లె పండగ నిర్వహించినట్లు ఎంపీడీఓ రాంకుమార్ తెలిపారు. కంబాలపల్లిలో రూ.20 లక్షలతో రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు మరమ్మతులకు భూమిపూజ చేపట్టారు. బొక్సంపల్లిలో పారంపాండ్లు, కోగిరలో హార్టికల్చర్ పనులు చేశారు. చిలమత్తూరు మండలంలోని చేనేపల్లిలో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం నుంచి జాతీయ రహదారిలోకి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీఓ రమణ మాట్లాడుతూ మండలానికి రూ. 10 కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో పల్లెలో అవసరమైన పనులు చేపడతామన్నారు. పరిగి మండల పరిధిలోని శిరేకోళం పంచాయతీ పరిధిలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. పెనుకొండ మండలం మునిమడుగులో పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించినట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. మునిమడుగులో రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అమరాపురం మండలం గొల్లమారనపల్లి, నిద్రగట్ట గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, నాయకులు జయకుమార్ పాల్గొన్నారు.



లేపాక్షి మండలంలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న అధికారులు

అగళి మండలం కోడిపల్లి, ఆర్‌జిపల్లి పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదవేంద్ర తదితరులు పాల్గొన్నారు. గుడిబండ మండలం కరికెర, దేవరహట్టి పంచాయతీ గ్రామాల్లో పల్లె పండుగ నిర్వహించారు. ఒక్కొక్క పంచాయతీకి రూ.20 లక్షలు చొప్పున సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. సోమందేపల్లి మండలంలోని గుడిపల్లి, తుంగోడు, వెలిదడకల గ్రామాల్లో అధికారులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గుడిపల్లిలో ఏడు సీసీ రోడ్డు పనులకు 28 లక్షలు, తుంగోడులో 11 సీసీ రోడ్డు పనులకు రూ.28 లక్షలు, వెలిదకలలో ఉద్యానశాఖకు సంబంధించి రూ.4లక్షల అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు.

అత్యాచారం చేసినవారిని కఠినంగా శిక్షించాలి





ఆందోళన చేస్తున్న మహిళా సంఘాల కార్యకర్తలు, పెనుకొండ ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న ప్రజా, దళిత సంఘాల నాయకులు

హిందూపురం అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మహిళలపై అత్యాచార ఘటనకు పాల్పడినవారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కన్వీనర్ దిల్షాద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత మహిళలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మహిళలపై అఘాయిత్యాలు తీవ్రమయ్యాయని అన్నారు. చిన్నారుల దగ్గర నుంచి ముదుసలి వరకు వేధింపులకు గురతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల తప్పు చేయాలంటేనే భయపడేలా దోషులను శిక్షించేలా చట్టాలను తీసుకురావాలన్నారు. బయటి రాష్ట్రం నుంచి వచ్చే వలస కార్మికులకు రక్షణ కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు ఐద్వా నాయకులు జ్యోతి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

పెనుకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చిలమత్తూరు మండలంలో అత్తా, కోడలిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు ఒక్కొక్కరికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని పెనుకొండ ప్రజాసంఘాలు, దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఎమ్మార్పీఎస్, మాల మహానాడు నాయకులు రామాంజనేయులు, ఎంఎస్ మూర్తి, నరసింహులు, నారాయణ, లక్ష్మీనారాయణ, పోతులయ్య, ఆంజనేయులు, పెద్దన్న తదితరులు ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెరిగిన హుండీ ఆదాయం



హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్న కమిటీ సభ్యులు

లేపాక్షి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొంగటిపల్లి ముత్యాలమ్మ హుండీ ఆదాయం భారీగా పెరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం దసరా పండగ సందర్భంగా హుండీ ఆదాయాన్ని లెక్కిస్తారు. సోమవారం హుండీని లెక్కించగా రూ.1,00,240 ఆదాయం వచ్చిందన్నారు. ప్రతి సంవత్సరం రూ.30వేల నుంచి రూ.40వేల మధ్య ఆదాయం వచ్చేదని ఈసారి ఆదాయం భారీగా పెరిగిందన్నారు. భక్తుల తాకిడి పెరిగిందని, రాబోవురోజుల్లో ఆలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెస్తామన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

మంత్రి సవితకు భవన నిర్మాణ కార్మికుల వినతి

పెనుకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ సంఘం నియోజకవర్గ కమిటీ సభ్యులు బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితకు సోమవారం వినతి పత్రం అందించారు. కమిటీ జిల్లా నాయకులు రవి, కొండా వెంకటేశులు తదితరులు వినతి పత్రం అందిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో ఇసుక ఆపివేసి నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా చేశారన్నారు. అనేక సంవత్సరాలుగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపివేస్తూ గత వైసీపీ ప్రభుత్వం 12, 14 మెమోలు జారీచేసిందన్నారు. ఎన్నికల ముందు తెలుగుదేశంపార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమయ్య, రామాంజనేయులు, తిప్పన్న, రంగప్ప, ప్రసాద్, వెంకటరమణప్ప, బాబ్జాన్, మహబూబ్‌బాష, రఫీక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పెనుకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాల సూచన ఉండటంతో పెనుకొండ నగరపంచాయతీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు కంట్రోల్‌రూమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో 0855221116కు ఫోన్ చేయవచ్చని ఆయన వివరించారు.

ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వండి

సోమందేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం వల్ల మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో విపత్తువల్ల ఎలాంటి నష్టం వాటిల్లినా వెంటనే సమాచారం ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో వీఆర్‌ఓలు, సచివాలయ, పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు నిండి ఉన్నాయని ముంపు ప్రమాదాన్ని గుర్తించాలన్నారు.

కేబుల్‌వైరు చోరీ

గోరంట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాగానిపల్లి రక్షిత తాగునీటి పథకం బోరుకు ఏర్పాటు చేసిన కేబుల్‌వైరును ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం చెరువు వద్ద బోరు వేసి, మోటారు బిగించి నీరు సరఫరా చేస్తున్నారు. దొంగలు 30 మీటర్ల కేబుల్ వైరును చోరీ చేయడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించి నీటి సరఫరా అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హిందూపురం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గొంతు కోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సోమవారం పట్టణ పరిధిలోని బోయపేటలో చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. బోయపేటకు చెందిన వెంకటేష్ గత కొంత కాలంగా బోద కాలతో బాధపడుతున్నాడు. కుడి కాలుకు గాయాలు కావడంతో చికిత్స కూడా జరిగింది. నొప్పి తీవ్రంగా ఉండటంతో బాధ భరించలేక గొంతు కోసుకొని ఆత్మహత్య యత్నించినట్లు తెలిపారు. బంధువులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యుడు చక్రధర్ చికిత్సలు అందించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

గోరంట్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు గ్రామం శ్రీరంగనాథస్వామి నూతన ఆలయ నిర్మాణానికి గుట్టిపల్లికి చెందిన రామక్రిష్ణమ్మ సోమవారం రూ.50,116 విరాళం అందించారు. పురాతన ఆలయ స్థానంలో నూతన ఆలయాన్ని గ్రామస్థులు నిర్మిస్తున్నారు. ఈ మేరకు రామక్రిష్ణమ్మ కుటుంబ సభ్యుల ద్వారా విరాళం అందించారు. అర్చకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



విరాళమిచ్చిన దాతలకు రసీదు అందచేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు